విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను..
తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి..సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక



టీవీ రిపోర్టర్లు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు




చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 24-05-2025 సంపుటి : 11 | సంచిక : 121 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# కరోనా కలకలం..

## ఏపీలో మరో కేసు



కడప, మే 23: ఏపీలో కరోనా కేసులు నమోదు కలకలం రేపుతోంది. కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి.విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్ గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు.ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది.ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం , దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి-వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.


# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం..

విశాఖ: ఉక్కునగరం విశాఖ స్టీల్ ప్లాంట్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఎస్ఎంఎస్-2లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన స్టీల్ ప్లాంట్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. అయితే ప్రమాద సమయంలో కార్మికులు విధుల్లో లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. అగ్నిప్రమాదం తెల్లవారుజామున జరగడంతో కార్మికులు విధులకు హాజరు కాలేదు.అయితే ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై స్టీల్ ప్లాంట్ అధికారులు ఇంతవరకూ స్పందించలేదు. ఆస్తి నష్టం ఏ మేర జరిగిందనే విషయాలు తెలియరాలేదు. దీనిపై అధికారులు అంచనా వేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-2లో ద్రవపు ఉక్కు ప్రమాదాలు జరుగుతుంటాయని కార్మికులు చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఒకవైపు కార్మికులు చేస్తున్న దీక్ష.. మరోవైపు ఈ ప్రమాదం జరగడం.. సమయానికి కార్మికులు విధులకు వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంటున్నారు.కాగా, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు సమ్మె చేపట్టారు. మంగళవారం నుంచి కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. వారి సమ్మెకు సంఘీభావంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు సైతం ఒకరోజు సమ్మె చేపట్టారు. ఉద్యోగులకు నోటీసులు.. కార్మికుల తొలగింపునకు నిరసనగా విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని, రెగ్యులర్ ఉద్యోగులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాలన్న డిమాండ్లతో కార్మికులు సమ్మెకు దిగారు.మరోవైపు కార్మికులకు మద్ధతుగా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు.

# రాష్ట్ర సాంస్కృతిక సంపదను ప్రపంచానికి చాటటమే లక్ష్యం : ఆర్ పి సిసోడియా

**హస్తకళలు, చేనేత వస్త్రాల ప్రోత్సాహమే ధ్యేయంగా లేపాక్షి- ఆప్కోల మధ్య భాగస్వామ్య ఒప్పందం**






విజయవాడ, మే 23( ) ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంపదను ప్రపంచం ముందుకు తీసుకురావడం లక్ష్యంగా, లేపాక్షి (ఏపీ హ్యాండిక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్), ఆప్కో (ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) ప్రతినిధులు విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. లేపాక్షి, ఆప్కో ముఖ్య అధికారుల సమక్షంలో శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా హాజరయ్యారు. ఈ ఒప్పందం ద్వారా లేపాక్షి ఆప్కో సంస్థలు పరస్పరం తమ అత్యుత్తమ హస్తకళలు, చేతివస్త్రాల ఉత్పత్తులను రెండు సంస్థల షోరూంలలో ప్రదర్శించి విక్రయించేందుకు అవకాశం లభిస్తుంది. ఈ భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్ శిల్పకారులు, నేత కారులకు కొత్త మార్కెట్ అవకాశాలను అందించడంతో పాటు, వినియోగాదారులకు మరింత సంప్రదాయ సొబగుల అనుభవాన్ని అందించనుంది.ఈ సందర్భంగా ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం రాష్ట్ర శిల్పకారుల జీవితాలలో మార్పు తీసుకురాగల కీలకమైన అడుగని అభిప్రాయపడ్డారు. "లేపాక్షి, ఆప్కో భాగస్వామ్యం ఒక వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదని, ఇది ఆంధ్రప్రదేశ్ కళాకారుల, నేత కార్మికుల కళలకు గౌరవం అందిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరచటానికి ఒక సుస్థిరమైన వేదికను సృష్టించడం అవుతుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్ చేనేత ఉత్పత్తులు, కళాకృతులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపును పొందే అవకాశాలు మెరుగవుతాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు మార్గ నిర్దేశకత్వంలో రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని నిలబెట్టే ప్రయత్నంలో జరుగుతున్న కృషికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని సిసోడియా అన్నారు. ఆప్కో, లేపాక్షి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా రెండు సంస్థలు పరస్పరం కలిసి పని చేస్తూ రాష్ట్ర చేనేత కార్మికుల జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వారి కళలను విపణిలోకి తీసుకెళ్ళడంలో ముందడుగుకు ఉపకరిస్తుందన్నారు. సంయుక్త శ్రేయస్సును కాంక్షిస్తూ చేసుకున్న ఈ భాగస్వామ్య ఒప్పందం వాణిజ్య పరంగా ఒక కొత్త మైలురాయి అవుతుందన్నారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఉత్పత్తుల పరస్పర పంపిణీ, షోరూంలలో ప్రదేశాల కేటాయింపు, వ్యూహాత్మక ఖర్చు తగ్గింపుపై స్పష్టమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో జనరల్ మేనేజర్లు నాగేశ్వరరావు, రాజారావు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి, అసిస్టెంట్ డైరెక్టర్ బెనహర్, లేపాక్షి మార్కెటింగ్ మేనేజర్ శ్రీధరాచార్యులు, డెవలప్మెంట్ మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ ఉత్పత్తులకు కొత్త ప్రపంచం..



న్యూఢిల్లీ, మే 23 దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఓ వైవిధ్యం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ వైవిధ్యమే ఈశాన్య రాష్ట్రాలకు బల మని ఆయన స్పష్టం చేశారు. భారతదేశమే ఒక వైవిధ్యభరితమైన దేశమని, అలాంటి దేశంలో ఈశాన్య రాష్ట్రాల ప్రాంతం అత్యంత వైవిధ్యభరితమైన భాగమని అభివర్ణించారు. శుక్రవారం న్యూఢిల్లీలో రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు.అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాల వైవిధ్యానికి వాణిజ్యం నుంచి సంప్రదాయం వరకు, వస్త్ర రంగం నుంచి పర్యాటకం వరకూ బలాన్ని ఇస్తుందన్నారు. టీ, వెదురు ఉత్పత్తులు, సహజ వాయువు, క్రీడలు, నైపుణ్యానికి ఈశాన్య రాష్ట్రాలు పర్యాయ పదమని చెప్పుకొచ్చారు. ఇక ఆర్గానిక్ ఉత్పత్తులకు సైతం ఈ రాష్ట్రాలు కొత్త ప్రపంచమని కీర్తించారు. అలాగే దేశానికి ఈశాన్య ప్రాంతం శక్తి కేంద్రమన్నారు. కానీ తమకు మాత్రం ఈ రాష్ట్రాలు అష్టలక్ష్ములతో సమానమని ఆయన అభివర్ణించారు. ఈస్ట్ అంటే దిశ మాత్రమే కాదని.. ఇయా.. అంటే ఎంపావర్ (సాధికారత), యాక్ట్ (చర్య), స్ట్రేంథెన్ (బలోపేతం), పరివర్తన ( ట్రాన్స్‌ఫారమ్) అంటూ ప్రధాని మోదీ వివరించారు.గతంలో ఈశాన్య రాష్ట్రమంటే.. సరిహద్దు ప్రాంతంగా మాత్రమే అంతా భావించేవారని గుర్తు చేశారు. కానీ ఆయా రాష్ట్రాలు నేడు అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్నాయన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు.. పర్యాటక రంగాన్ని ఆకర్షణీయంగా చేస్తాయన్నారు. అంతేకాకుండా అవి పెట్టుబడి దారులకు మరింత విశ్వాసాన్ని అందిస్తాయని చెప్పారు.ఈశాన్యంలో తాము మౌలిక సదుపాయాల విప్లవాన్ని ప్రారంభించామని.. ఈశాన్యం లో అనుసంధానత మరింత బలపడుతోందని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోని సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈశాన్య ప్రాంతం పాత్ర బలపడు తోందన్నారు. దేశాభివృద్ధిలో ఈశాన్య రాష్ట్రాల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ ఈ సందర్భంగా సోదాహరణగా వివరించారు. ఈశాన్య ప్రాంతంలోని ప్రతి రాష్ట్రం పెట్టుబడులకే కాదు.. నాయకత్వానికీ సిద్దంగా ఉన్నామని స్పష్టం చేస్తుందన్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా తూర్పు భారతదేశం ప్రాముఖ్యతను ప్రధాని మోదీ వివరించారు.

# కేంద్రమంత్రి జోషితో భేటీపై సీఎం చంద్రబాబు ట్వీట్



అమరావతి, మే 23 ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. కేంద్రమంత్రులతో సీఎం వరుసగా భేటీలు అవుతున్నారు. ఉదయం న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం స్పందించారు. న్యూ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సమావేశం సంతృప్తినిచ్చిందన్నారు. పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలి యోజన రూఫ్ టాప్ సోలార్ కెపాసిటీ అలోకేషన్ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.20 లక్షల ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై ఉచితంగా సోలార్ ఏర్పాటు లక్ష్యాన్ని సాధించేందుకు సహకరించాలని కోరామన్నారు. ప్రతి నియోజకవర్గంలో బీసీలకు పదివేల రూపాయల వరకూ సబ్సీడీతో సోలార్ రూఫ్ టాప్‌లో సోలార్ ప్యానల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించామని చెప్పారు. కేంద్ర సహకారంతో విద్యుత్తు ధరలు తగ్గించడంతో పాటు క్లీన్ ఎనర్జీకి తమ వంతు సహకారం అందిస్తామని వెల్లడించినట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు.కాగా.. ఈరోజు ఉదయం కేంద్రమంత్రి ప్రహద్ జోషిని సీఎం చంద్రబాబు కలిశారు. ఈ సందర్భంగా పీఎం సూర్య ఘర్ యోజన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ కేటాయింపులు ఇవ్వాలని సీఎం కోరారు. హరిత ఇంధనాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్య కేటాయింపుల కోసం ఓ ప్రతిపాదనను సమర్పించారు. 2025 జనవరిలో ఏపీడిస్కంలు సమర్పించిన ప్రతిపాదనకు త్వరితగతిన ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరారు. ఈ ప్రతిపాదన కింద 20 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లు లభిస్తాయని. అలాగే బీసీ గృహాలకు కిలోవాట్‌కు రూ.10,000 చొప్పున 2 కిలోవాట్ల వరకు అమర్చుకునేలా సబ్సీడీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.రాష్ట్ర క్లీన్ ఎనర్జీ పాలసీ 2024?29 లో భాగంగా అదనంగా 72.6 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని, ఇందులో 40 గిగావాట్ల సౌరశక్తిని లక్ష్యంగా పెట్టుకుందని.. ఇది సామాన్యులకు కూడా సౌరశక్తిని అందుబాటులోకి తీసుకు వస్తుందన్నారు. ప్రతిపాదిత యుటిలిటీ నేతృత్వంలోని రూఫ్‌టాప్ మోడల్ ఏపీ విద్యుత్ కొనుగోలు వ్యయాలను తగ్గించడంతో పాటు, బలహీన వర్గాలకు సాధికారత కల్పిస్తుందని, ఉద్యోగ కల్పనను ప్రోత్సహిస్తుందన్నారు. కేంద్రం సహకరిస్తే ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన వినియోగంలో దేశానికి ముమ్ముందు మార్గనిర్దేశం చేయగలదని, ఒక బెంచ్‌మార్క్‌ను నెలకొల్పుతుందని సీఎం చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు.అనంతరం కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, ఏరోస్పేస్ రంగాలలో ఆంధ్రప్రదేశ్ దూరదృష్టిని కేంద్ర రక్షణ మంత్రికి సీఎం వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కీలక ప్రాంతాల్లో పారిశ్రామిక వృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పరిశోధన సహకారం, వ్యూహాత్మక సంస్థాపనలతో కూడిన సమగ్ర ప్రణాళికను వివరించారు. పునరుద్ధరణ, స్వదేశీ విమానయాన కార్యక్రమాలకు మద్దతు, టెస్టింగ్, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేకంగా స్థానికంగా లభించే సామర్థ్యాలను ప్రోత్సహించడానికి తగ్గ రక్షణ కేంద్రాల సృష్టి ఉన్నాయన్నారు. పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, క్రియాశీలక విధాన వాతావరణంతో ఆత్మనిర్భర్ భారత్‌ను రక్షణ ఉత్పత్తి, ఆవిష్కరణల ద్వారా ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# సంపాదకీయం

శనివారం 24-05-2025

## వివాదంగా మారిన ఎంపిల పేర్ల ప్రకటన

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు ప్రపంచ దేశాల నుంచి గట్టి మద్దతు లభించింది. చైనా, టర్కీ వంటి కొన్ని దేశాలు పాకిస్థాన్ కు మద్దతు పలికినా, మెజారిటీ దేశాలు మన దేశానికి సంపూర్ణ మద్దతునిచ్చాయి. మద్దతు ఇవ్వడమే కాదు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులను సమర్ధించాయి. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నపాకిస్థాన్ ఉగ్ర రూపాన్ని ప్రపంచం ముందు ఉంచేందుకు.. తద్వారా అంతర్జాతీయంగా పాకిస్థాన్ ను ఏకాకిని చేసేందుకు,ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దౌత్య వ్యూహాన్ని సిద్ధం చేసింది. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల అమానుష ఉగ్ర దాడుల చరిత్రను, ఉగ్ర కుట్రల్ని ప్రపంచ దేశాలకు విశదీకరించేందుకు.. మరీ ముఖ్యంగా 26 మంది అమాయక పర్యాటకులను, అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన నేపథ్యంగా మన దేశం చేపటిన ఆపరేషన్ సిందూర్ పూర్వపరాలను వివరించేందుకు పార్లమెంట్ సభ్యుల ప్రతినిధి బృందాలను వివిధ దేశాలకు పంపాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, భారత్‌లో ఉగ్రమూకల చర్యలకు ఊతంగా వున్న పాకిస్థాన్ ధోరణిని ప్రపంచ దేశాలకు వివరించాలని మోదీ ప్రభుత్వం తలపెట్టింది. అఖిలపక్ష ఎంపీలతో ఏర్పాటు చేసిన ఏంపీల బృందాలు వివిధ దేశాల్లో పర్యటించనున్నాయి. బుధవారం ఇం దులో రెండు బృందాల పర్యటన మొదలైంది. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులైన టూరిస్టులు 26 మందిని పొట్టనపెట్టుకోవడం, దానికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో భారత సైన్యం పాకిస్థాన్‌లో ఎంపిక చేసుకున్న ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేయడం జరిగింది. పాకిస్థాన్‌తో గతంలో జరిగిన సింధూ జలాల ఒప్పందం రద్దు మొదలు వాణిజ్యం, ఇతర అంశాలపై భారత్ అన్ని విధాలుగా ఆ దేశంతో సంబంధాలను తెగదెంపులు చేసుకున్నది. 'ఆపరేషన్ సిందూర్' మింగుడు పడని పాకిస్థాన్ ఏకంగా భారత సరిహద్దుల రాష్ట్రాల్లోని మిలిటరీ స్థావరాలను, నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడింది. తమ దగ్గరున్న అణ్వాయుధాలతోనూ భారత్‌పై దాడి చేస్తామని కూడా పాకిస్థాన్‌లోని కొందరు రాజకీయ నాయకులు ప్రగల్భాలు పలికా రు. ఉగ్రవాదులకు తావుగా వున్న పాకిస్థాన్, కశ్మీర్ సమస్యను బూచిగా చూపి ఉగ్రసంస్థలను భారత్ భూభాగంలోకి ప్రయోగించడం కొత్తేమి కా దు. కాని దృఢ సంకల్పంతో భారత్, పాకిస్థాన్‌కు ఈసారి బుద్ధిచెప్పిన తీరు ను ప్రపంచ దేశాలు మౌనంగానే ఆమోదించాయని చెప్పవచ్చు. రెండు దే శాల మధ్య ఉద్రిక్తతలు పెరిగి, అది యుద్ధంగా పరిణమించకూడదనే పలు దేశాలు హితవు పలికాయి. ప్రపంచ దేశాలకు ఉగ్రదాడులపై భారత్ వైఖరి ఎలా వుండబోతున్నది, పాక్ ప్రదర్శిస్తున్న వైఖరి ఏమిటనేది వివరించాలని మోదీ ప్రభుత్వం సంకల్పించింది. ఉగ్రతండాలను భారత్‌లో దాడులకు ఉసిగొల్పడం, భారత్ ప్రతిగా దాడులు చేస్తే అణ్వాయుధాలను బూచి చూపడం ఇకపై చెల్లదనేది భారత్ స్పష్టం చేస్తున్నది. అణ్వాయుధాలను చూపి బ్లాక్‌మెయిల్ చేసే ధోరణి విడనాడకపోతే పాకిస్థాన్ సైన్యం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనేది భారత్ ఈ సందర్భంలో ప్రపంచ దేశాలకు స్పష్టం చేయనున్నది. ఇందుకు సంబధించి కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రధన పార్టీలకు లేఖలు రాశారు. ప్రపంచ దేశాలకు భారత వాణిని బలంగా వినిపించే ఎంపీల పేర్లను పంపాలని కోరారు. అందుకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ, నలుగురు ఎంపీల పేర్లను పంపింది. అయితే.. ఆ పేర్లలో ఐక్య రాజ్య సమితి కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవంతో పాటుగా,విదేశీ వ్యవహార స్థాయి సంఘం చైర్మన్ గా ఉన్న సీనియర్ ఎంపీ శశిథరూర్ పేరు లేదు. మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్ సభలో కాంగ్రెస్ పార్టీ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్, మరో ఇదరు ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, రాజా బ్రార్ పేర్లను కాంగ్రెస్ పార్టీ పంపింది. అయితే, ప్రభుత్వం విడుదలచేసిన జాబితాలో కాంగ్రెస్ నుంచి శశిథరూర్ పేరు ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్ పంపిన జాబితాలో శశిథరూర్ పేరు లేకపోయినా ఆయన పేరును కేంద్రం ప్రకటించడం, వివాదంగా మారింది. మరో వంక. శశిథరూర్ అఖిలపక్ష బృందానికి నాయకత్వం నడిపించే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. పహల్గాం దాడి నుంచి ఇటీవల చోటుచేసుకున్న కార్యకలాపాలపై భారత వైఖరిని ప్రపంచ దేశాల ముందు చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.

# అలా మారిపోతున్నారేంట్రా...

విశాఖపట్టణం, మే 23, ఏపీలో వైసీపీకి వరుసగా అన్నీ ఎదురు దెబ్బలే తగులుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత ఫ్యాన్ పార్టీకి అన్నీ కష్టాలే ఎదురవుతున్నాయన్న టాక్ విన్పిస్తోంది. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీకి ఇప్పటికే చాలా మంది సీనియర్లు గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు..ఇలా వరుసపెట్టి నేతలు కూటమి పార్టీల్లోకి క్యూ కట్టారు. మరికొంతమంది కూడా పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారట.ఇలా పార్టీ నుంచి నేతలంతా జారుకుంటుంటే అటు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సైతం కూటమి దక్కించుకుంటుంది. ఇప్పటికే మెజార్టీ కార్పొరేషన్లను దక్కించుకున్న కూటమి?తాజాగా మున్సిపాలిటీలను కూడా తన ఖాతాలో వేసుకుంటూ వైసీపీకి వరుస షాకులిస్తోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఆపార్టీకి అన్నీ ఎదురుదెబ్బలే తగుతున్నాయి. మున్సిపాలిటీలు చేజారకుండా వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా..సైకిల్ దెబ్బకు ఆపార్టీ మున్సిపాలిటీలన్నీ కూటమి వశం అవుతున్నాయి.ఇప్పటికే మెజార్టీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకున్న కూటమి..తాజాగా కదిరి మున్సిపాలిటీని కూడా టీడీపీ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దిల్షా దున్నీషా ఎన్నికకాగా..వైస్ చైర్మన్లుగా సుధారాణి, రాజశేఖర్ ఆచారి సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఈ ఎన్నికను వైసీపీ బహిష్కరించింది. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా..వైసీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో 25 మంది మద్దతులో దిల్ షాదున్నీసా చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. గాండ్లపేట ఎంపీపీగా గజ్జల సోముశేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం ఏడుగురు ఎంపీటీసీల్లో నలుగురు టీడీపీ సభ్యులు హాజరుకాగా?ముగ్గురు వైసీపీ సభ్యులు రాలేదు.ఇదిలా ఉంటే మరోవైపు విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన శరత్‌బాబు ఎన్నికయ్యారు. గత నెల 29న ఛైర్మన్ మురళీకృష్ణారావుపై అవిశ్వాసం ప్రవేశపె ట్టగా..అవిశ్వాస ఓటింగ్‌లో టీడీపీ గెలిచింది. దీంతో మురళీకృ ష్ణారావు ఛైర్మన్ పదవి కోల్పోయారు. మొత్తం 20 మంది సభ్యుల మద్దతుతో బొబ్బిలి మున్సిపాలిటీ కూటమి ఖాతాలోకి చేరింది.ఇక తిరువూరు నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక వాయిదాపడి ంది..కోరం లేకపోవడంతో వచ్చే మంగళవారానికి ఎన్నికను వాయిదా వేశారు. మొత్తం 20 మందికి గాను ఏడుగురు మాత్రమే హాజరుకావడంతో వాయిదా వేస్తూ ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు. అలాగే శ్రీసత్యసాయిజిల్లా రామగిరి ఎంపీపీ ఎన్నిక మూడోసారి వాయిదా పడింది. వైసీపీ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరుకావడంతో ఎన్నిక వాయిదా పడింది. గతంలో కోరంలేక ఎంపీపీ ఎన్నిక రెండుసార్లు వాయిదా పడింది.ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆపార్టీ మున్సిపల్ పీఠాలను దాదాపుగా దక్కించుకుంది. అయితే వీటిని ఫ్యాన్ పార్టీ నుంచి లాగేసుకునేందుకు కూటమి విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. తొలుత ఈ ప్రయత్నాలన్నీ విఫలమైనా?ప్రస్తుతం వైసీపీ మున్సిపాలిటీలన్నీ కూటమి ఖాతాలో వచ్చి పడుతున్నాయి. ఆయా కార్పొరేషన్లలో సైతం విపక్ష పార్టీ పని అయిపోయిందన్న టాక్ ఏపీ రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.ఫ్యాన్ పార్టీ పాగా వేసిన కీలక స్థానాలన్నింటిని కూటమి కూకటివేళ్లతో సహా పెకిలిస్తోంది. వైసీపీ కంచుకోటలను ఆ మూడు పార్టీలు బద్దలు కొడుతుండడంతో ఏపీలో ఇప్పటికే మెజార్టీ మేయర్ పీఠాలన్నీ కూటమి ఖాతాలోకి వెళ్లాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని ఆ పార్టీ కార్పొరేటర్లు అంటున్నారట. ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్లు, కార్పొరేషన్లలో మేయర్లు వైసీపీకి అనుకూలంగా పనిచేశారే తప్ప ప్రజాప్రతినిధులుగా పనిచేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.వైసీపీ అధికారం కోల్పోవడంతో వైసీపీ మేయర్లంతా ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారట. అప్పటికే అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లను కూటమి పార్టీలు ఆహ్వానించాయి. దీంతో ఎవరి అవసరం కోసం వారు ఆయా పార్టీల్లో చేరిపోయారు. మెజార్టీ పెరిగిన కూటమి పార్టీలు ఆయా కార్పొరేషన్లలో మేయర్లపై అవిశ్వాసం పెట్టించారు.వైసీపీ ఓడిపోవడంతో ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లన్నీ కూటమి పార్టీల చేతుల్లోకి వెళ్లిపోయాయి. మొత్తానికి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడంతో ఏ జిల్లాలోనూ కనీస మెజార్టీ లేకపోవడంతో కూటమికి అన్ని విధాలుగా పైచేయి లభించినట్లు అయిందన్న టాక్ విన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే రహదారులు, మంచినీటి సమస్య, డ్రైనేజి ఇతర మౌలిక సదుపాయాలు వంటి సమస్యలన్నింటినీ పరిష్కరించే ప్రయత్నం చేయడంతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని టాక్.

# గంటా శ్రీనివాస్ కొడుకు తెలిసి తెలియనతనమా...

విశాఖపట్నం, మే 23 జోహార్ ఎన్టీఆర్, అంటూ అదే ఫ్లో లో బతికి ఉన్న వాళ్లకు జోహార్ చెప్పేశారు? ఓ యువనేత. రాజకీయాల్లో ఓటమి తెలియని మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ కొడుకు నోటి నుండి వచ్చిన పలుకులివి. తండ్రి ఏమో రాజకీయాల్ని శాసించే స్థాయికి ఎదిగి ఓటమి తెలియని నాయకుడిగా ముద్ర వేయించుకుంటే రాజకీయ ఆరంగేట్రానికి సిద్ధంగా ఉన్న కొడుకు రవితేజ తన తెలిసీ తెలియనితనంతో అందరిలో నవ్వులపాలవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాల్లో ఓటమి తెలియని నాయకుడు ఎవరు అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు మాజీ మంత్రి ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు... ఓటమి ఎరుగని రాజకీయ నాయకుడిగా పేరున్న గంటా శ్రీనివాసరావు 4 సార్లు ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా గెలిచి తన రాజకీయ ప్రయాణంలో ఓటమిని దరిదాపులకు రాకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నారు. టీడీపీ నుంచి పీఆర్పీకి, అక్కడ నుంచి కాంగ్రెస్‌కి తర్వాత తిరిగి టీడీపీకి వచ్చిన గంటా శ్రీనివాస్ తన ఇమేజ్‌కి ఎక్కడా డ్యామేజ్ అవ్వకుండా పలికెల్ల రాజకీయ జీవితంలో ఓ మెట్టు పైకి ఎదుగుతూనే వచ్చారు. అలాంటి మాజీ మంత్రికి ఇప్పుడు కొడుకు రూపంలో కొత్త తలనొప్పి మొదలైందంట. రాజకీయ నాయకుల్లో అత్యధికులు కచ్చితంగా రాజకీయ వారసత్వాన్ని తెరమీదకి తీసుకొచ్చి తమ బిడ్డల్ని గ్రాండ్ లాంచ్ చేస్తారు. అలాగే గంటా శ్రీనివాస్ తన కొడుకు రవితేజని రాజకీయాల్లో గ్రాండ్‌గా లాంచింగ్ చేయడానికి ప్లాన్ చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భీమిలి నుండి గెలిచిన ఆయన భీమిలి నియోజకవర్గం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో తనతో పాటు తన కొడుకును కూడా ముందు పెట్టి నడిపిస్తున్నారు. గత సంవత్సర కాలంగా భీమిలి నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో గంటా కొడుకు రవితేజ అన్ని తానై ముందుండి నడిపిస్తున్నారు. ఇప్పటివరకు అన్ని ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల



నిర్వహణలో ముందు ఉండి పనులు చేస్తున్న రవితేజ పెద్దగా ప్రసంగాలు చేయలేదు. స్టేజ్ మీద మాట్లాడితే ఒక్క నిమిషానికి మించి ఏ రోజు మాట్లాడింది లేదు. అలాంటి గంటా రవితేజ తాజాగా భీమిలి నియోజకవర్గంలో జరిగిన మినీ మహానాడులో తన తండ్రితో పాటు నియోజకవర్గంలోని కీలకమైన రాజకీయ నాయకుల సమక్షంలో క్యాడర్ని ఉత్సాహపరచడానికి మాట్లాడుతూ నోరు జారి జోహార్ సీఎం సార్, జోహార్ లోకేష్ అన్నయ్య అంటూ నినాదాలు చేశారు. రవితేజ తెలిసీ తెలియక కనబర్చిన అత్యుత్సాహాన్ని కేడర్ మొత్తం ఫాలో అయింది. చేసిన తప్పును గుర్తించి సరిదిద్దుకునే లోపే జరగాల్సిన డ్యామేజ్ మొత్తం జరిగిపోయింది. రవితేజ మినీ మహానాడు స్టేజ్ మీద మాట్లాడిన ఈ మాటలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. బ్రతికున్న వాళ్లకు జోహార్లు ఏంటయ్యా అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తూ ట్రోల్ చేస్తున్నారు.ఆ వ్యాఖ్యలతో గంటా వారసుడు నవ్వులపాలు అవుతున్నా... ఇంతకాలం ఆయన ఎవరో తెలియని వారికి కూడా పరిచయమవుతున్నారంట. గంటా రవితేజ తెలియని వారు ఉండరు అనే అంతగా సోషల్ మీడియాలో పాపులర్ అవుతున్నారు. గంటా శ్రీనివాస్ తన కొడుకుని సినిమా ఇండస్ట్రీలో హీరోగా నిలబెట్టి కొత్త ఇమేజ్ క్రియేట్ చేయాలనుకున్నారు. స్టార్ డైరెక్టర్ జయంత్ సి పరాన్జీతో పవర్ ఫుల్ పోలీస్ క్యారెక్టర్‌తో జై దేవ్ అనే మూవీతో గంట రవితేజను లాంచ్ కూడా చేశారు. జయదేవ్ సినిమా డిజాస్టర్ కావడంతో గంటా రవితేజ తనకి సినిమాలు సరిపడవు అనుకున్నారో ఏమో?మొదటి సినిమాతోనే సినిమా ఇండస్ట్రీకి గుడ్‌బై చెప్పేసి తండ్రి రాజకీయ వారసుడిగా ఓనమాలు నేర్చుకోవడం మొదలుపెట్టారు. టీడీపీ అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో జరుగుతున్న మినీ మహానాడు తన ఆ రాజకీయ ఆరంగేట్రానికి సరైన సమయం అని భావించిన రవితేజకు తొలి పొలిటికల్ ప్రసంగంలోనే చుక్కెదురవ్వడంతో.. ఆయన భవిష్యత్తు రాజకీయం ఎలా ఉండబోతుందన్న సందేహాలు మొదలయ్యాయి. 2024 ఎన్నికల బరిలో తన వారసుడ్ని ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించాలని గంట శ్రీనివాస్ ప్రయత్నం చేసినట్టు జోరుగా ప్రచారం సాగింది. చంద్రబాబు దగ్గర కూడా తన కొడుకుకి సీటు ఇవ్వాలని గంటా కోరినట్లు అప్పట్లో టాక్ నడిచింది. 2024 ఎన్నికల్లో ప్రతి సీటు టీడీపీకి కీలకం కావడంతో చంద్రబాబు నిరాకరించడంతో గంట తానే స్వయంగా భీమిలి బరిలోకి దిగి విజయం సాధించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కచ్చితంగా గంట శ్రీనివాస్ కు మంత్రి పదవి వస్తుందని అందరూ భావించారు. అయితే ఎవరు ఊహించని విధంగా చంద్రబాబు మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతో ఆయనకు నిరాశే మిగిలింది.మంత్రి పదవి రాకపోవడంతో నియోజకవర్గ మీద కొంత ఫోకస్ తగ్గించిన గంటా తన వారసుడ్ని ప్రమోట్ చేసుకునే పనిలో పడ్డారంట. రవితేజను భీమిలి నియోజకవర్గంలో బలమైన నేతగా తయారు చేయడానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్న మాజీ మంత్రి పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో కుమారుడ్ని ముందు పెట్టి నడిపిస్తున్నారంట. తీరా చూస్తే రవితేజ మినీ మహానాడు స్పీచ్‌తో అందరికీ కామెడీగా మారిపోయారు. మరి సినిమాల్లో ఫ్లాప్ అయిన ఆయన పొలిటికల్ స్క్రీన్‌పై ఏ మాత్రం రాణిస్తారో చూడాలి.

# గండికోట జలాశయ పునర్వసతి ప్యాకేజీలో అక్రమాలు.

## ఆర్డీఓ వినాయకంపై ర్యాంక్ తగ్గింపు
## గతంలో వినాయకం బద్వేల్ ఎమ్మార్వో

బద్వేలుకడపలోని గండికోట జలాశయం పునర్వసతి ప్యాకేజీలో ప్రభావితులకు ఆర్థిక సహాయం అందజేయడంలో అక్రమాలు చేసినందుకు జమ్మలమడుగు ఆర్డీఓ కె. వినాయకంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్య తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ ఉ అప్పీల్) నియమాల ప్రకారం జరిగిన విచారణలో 21 ఆరోపణలలో 15 పూర్తిగా నిరూపితమయ్యాయి. దాంతో, రెవెన్యూ (విజిలెన్స్) శాఖ శుక్రవారం (24-02-2025) జారీ చేసిన జీఓ ఆర్టీ నంబర్ 148 ప్రకారం, వినాయకంపై "ర్యాంక్ తగ్గింపు" శిక్ష విధించబడింది.2017లో కడప కలెక్టర్ నుండి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వినాయకపై నియమం-20 ప్రకారం క్రమశిక్షణా చర్యలు ప్రారంభమయ్యాయి. ఆయన 2018లో తన రక్షణ వాదనను సమర్పించినా, కడప జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని విచారణ సంఘం 2023లో తన నివేదికలో 21 ఆరోపణల్లో 15 పూర్తిగా, 2 పాక్షికంగా నిరూపితమని పేర్కొంది. ఈ నివేదికను 2024 జనవరిలో వినాయకకు అందజేసినప్పటికీ, ఆయన నుంచి సరైన సమాధానం అందలేదు.ప్రభుత్వం ఈ పరిణామాల దృష్ట్యా వినాయకను డిప్యూటీ కలెక్టర్ హోదా నుంచి ర్యాంక్ తగ్గిస్తూ శిక్షను అమలు చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాల అమలు బాధ్యత కడప కలెక్టర్ మరియు భూమి సంఘం చీఫ్ కమిషనర్ (మంగళగిరి) ఆధీనంలో ఉంటుంది. ప్రస్తుతం వల్నాడు జిల్లా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వినాయకంపై తక్షణమే ఈ శిక్ష అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ చర్య "సర్వీస్ నియమాల పట్ల నిర్లక్ష్యం" కారణంగా తీసుకున్నది అని ప్రభుత్వం వివరించింది. ఈ అంశంలో మరిన్ని చర్యలు భూమి సంఘం చీఫ్ కమిషనర్ మరియు కడప కలెక్టర్ చేపట్టాలని ఆదేశించారు.

# పార్టీ కార్యకర్తలకు అండగా వుంటాం

కాకినాడ,కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని.. మున్సిపల్ శాఖ, కాకినాడ జిల్లా ఇన్చార్జి మంత్రి పి. నారాయణ భరోసా ఇచ్చారు. కాకినాడలోని గోదావరి కళా క్షేత్రంలో తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా మహానాడు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభకు మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో కార్యకర్తలు కేసులు, అరెస్టులను ఎదుర్కొని పార్టీకి అండగా నిలబడ్డారన్నారు. మాజీ సీఎం జగన్ 10 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారన్నారు దేశంలో అందరికంటే ఎక్కువగా పింఛన్లు ఇస్తున్నామని, వచ్చేనెల నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, కొండబాబు,జ్యోతుల నెహ్రూ, సత్య ప్రభ, జిల్లాలోని ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

# టీటీడీకి విరాళంగా మరో కియోస్క్ యంత్రం

తిరుపతి : తిరుపతిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయానికి శుక్రవారం కియోస్క్ యంత్రాన్ని సౌత్ ఇండియన్ బ్యాంక్ విరాళంగా అందించింది. క్యూ ఆర్ కోడ్ యంత్రంతో యూపీఐ మోడ్ లో రూ. లక్ష వరకు భక్తులు విరాళంగా అందజేయవచ్చు. ఇప్పటికే సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు ఒక కియోస్క్ మిషన్ అందించగా తిరుమల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదాలు భవనంలో అందుబాటులో ఉంచారు. ఈరోజు



ఇచ్చిన మిషన్‌ను తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఉపయోగంలోకి రానుంది. కియోస్క్ మిషన్ లను తిరుమల అన్నదానం, పద్మావతీ గెస్ట్ హౌస్, సీఆర్వో ఆఫీస్ , దేవుని కడప, తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, అమరావతి, ఒంటిమిట్ట, పద్మావతీ అమ్మవారి ఆలయం, వకుళామాత ఆలయం, కపిలతీర్థం ఆలయం, హైదరాబాద్, చెన్నై , బెంగళూరు, విజయవాడ లలో టీటీడీ ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు ఏ.వి.నిరంజన్, ఆర్.వెంకటరావు, డి.అశోక్ వర్ధన్, ఆలయ డిప్యూటీ ఈవో బి నాగరత్న, ఐటీ డీజీఎం బి వేంకటేశ్వర్లు, ఏఈవో బి రవి, సూపరింటెండెంట్ డి ముని శంకర్, తదితరులు పాల్గొన్నారు.తిరుమల : హైదరాబాద్ కు చెందిన పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండీ సత్య రోహిత్ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.17 లక్షలు విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

# వినూత్న కార్యక్రమాలతో పవన్

గుంటూరు, మే 23, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జనంలోకి వెళ్లాలంటే కొంత ఇబ్బందులు తప్పవు. ఆయన ఇతర రాజకీయ నేతలు తరహా కాదు. సినీ హీరో కావడంతో పాటు లక్షలాది మంది అభిమానులు ఉండటంతో పవన్ కల్యాణ్ అంత సులువుగా జనంలోకి వెళ్లలేరు. ఏదైనా బహిరంగ సభలు, రోడ్ షోలకు మాత్రమే పరిమితమవుతారు. పాదయాత్ర వంటివి చేయాలన్నా ఆయనకు భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. వాహనంపై ఉన్నప్పటికీ అభిమానులు పోలీసు వలయాన్ని ఛేదించుకుని మరీ వచ్చి రచ్చ చేయడం అనేకసార్లు చూశాం. అభిమానుల తాకిడిని తట్టుకోవడం కూడా పవన్ కల్యాణ్ కు కష్టంగా మారి జనంలోకి రావడం అంటే పవన్ భయపడిపోతున్నారు. పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను ప్రత్యేకంగా వినియోగించుకోవడమే కాకుండా, తనకున్న పలుకుబడితో నిధులు తీసుకు రావడంతో గ్రామీణ రహదారులు మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి రోడ్డు సౌకర్యం లేక అల్లాడుతున్న ఏజెన్సీ ఏరియాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టారు. స్వయంగా గిరిజన ప్రాంతాలను దర్శించి వారితో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కారం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. ఒక్క గిరిజన ప్రాంతాలకు మాత్రమే నేరుగా పవన్ కల్యాణ్ జనంలోకి వెళుతున్నారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేయించి పల్లె పండగ పేరుతో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న సమస్యలను సర్పంచ్ తో



పాటు గ్రామ కమిటీలు కూర్చుని పరిష్కరించుకునేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీలకు ప్రభుత్వం చేత నిధులు విడుదల చేయించి విద్యుత్తు బకాయిలతో పాటు, రహదారులు, మంచినీటి సౌకర్యం వంటివి కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. గత వైసీపీ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో సర్పంచ్ లు అప్పుల పాలయ్యారు. దీంతో పవన్ కల్యాణ్ పట్టుబట్టి మరీ చంద్రబాబు నాయుడును ఒప్పించి నిధులను పంచాయతీలకు విడుదల చేయించి పల్లె పండగను నిర్వహించారు. మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన ఊరు-మాటామంతీ పేరుతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నేడు శ్రీకాకుళం జిల్లా రావివలస ప్రజలతో పవన్ కల్యాణ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. మన ఊరు-మాటామంతీ కార్యక్రమం జరగనుంది. టెక్కలిలోని థియేటర్ ఇందుకు వేదిక కానుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను నివేదించవచ్చు. అక్కడికక్కడే సమస్యలన పరిష్కరించేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడం శుభపరిణామమని అంటున్నారు.

## కరోనా ఆంక్షలు...

విజయవాడ, మే 23,దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఏపీలో కోవిడ్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలను వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసింది. కోవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దక్షిణాది రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు నమోదు అవుతుండటంతో ముందస్తు చర్యలు చేపట్టింది.దేశంలో మళ్లీ కోవిడ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రార్థన సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, బహిరంగ కార్యక్రమాలు వంటి అన్ని సామూహిక సమావేశాలను తక్షణం నిలిపి వేయాలని పేర్కొన్నారు.రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లు, విమానాశ్రయాలలో అన్ని అూఎఆ-19 ప్రవర్తన నియమావళి పాటించాలని స్పష్టం చేశారు. వృద్ధులు (60 ఏళ్లు పైబడిన వారు) గర్భిణీ స్త్రీలను ఖచ్చితంగా ఇంటి లోపలే ఉండాలని సూచించారు.మంచి పరిశుభ్రతను పాటించాలని-క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, దగ్గు/తుమ్ములు వచ్చినప్పుడు నోటిని కప్పి, పదేపదే ముఖాన్ని తాకడం వంటి పనులు చేయొద్దని సూచించారు. ప్రమాదకర ప్రాంతాలలో మాస్కులు ధరించాలని, రద్దీ ప్రదేశాలు, తక్కువ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశంలో ఉంటే, మాస్క్ ధరించడం ద్వారా వైరస్ వ్యాప్తిని తగ్గించడంలో సహాయ పడుతుందని సూచించారు.కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షించుకోవాలని-అూఎఆ-19 కేసులను ముందుగానే గుర్తించడంలో నిర్ధారణ పరీక్ష కీలకంగా ఉంటుందన్నారు. కోవిడ్ ప్రభావిత దేశాలకు ప్రయాణించిన వ్యక్తికి పరీక్షలు చేయించుకోవాలని, సాధారణ లక్షణాలలో లక్షణాలు వ్యక్తిని బట్టి మారుతూ ఉంటాయని తేలికపాటి నుండి మితమైన లక్షణాలలో జ్వరం, చలి, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి లేదా వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాలు లేదా శరీర నొప్పులు, ముక్కు కారటం లేదా ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు లేదా విరేచనాలు ఉంటాయి.ఇలాంటి లక్షణాలు గమనించినట్లయితే నిర్ధారణ మరియు చికిత్స కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు.అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండాలని ఇతరులను సంప్రదించకుండా ఉండటం ద్వారా ఇతరులను కోవిడ్ బారిన పడకుండా కాపాడొచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.ఆరోగ్య శాఖ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలతో 24/7 ల్యాబ్‌లతో మాస్క్, ఖఖఇ కిట్, ట్రిపుల్ లేయర్ మాస్కులను తగినంత పరిమాణంలో ఉంచుకోవాలని సూచించారు.

# నందిగం భార్య ఆడియో వైరల్

గుంటూరు, మే 23, ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ఉంది ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల పరిస్థితి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఇంకా కూటమికి నాలుగేళ్ల పదవీకాలం ఉంది. అయితే 2029 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామేనంటూ వైయస్సార్ కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరికొందరైతే పలానా పదవి తమదేనంటూ చెప్పుకొస్తున్నారు. మరోవైపు నేతల భార్యలు సైతం పెద్ద పెద్ద పదవులు తమ వేనంటూ బాహటంగా చెబుతున్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని వారు సైతం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తుండడం విశేషం. అయితే తాజాగా మాజీ ఎంపీ నందిగాం సురేష్ భార్య బేబీ లత అయితే.. తనను హోం మంత్రి అంటూ అంతా పిలుస్తున్నారని చెప్పుకొస్తున్నారు. ఆమెకు సంబంధించి ఓ ఆడియో సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తీవ్ర చర్చకు దారితీస్తోంది.బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇటీవల అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనను ఓ హత్య కేసులో అరెస్టు చేశారు. సుమారు మూడు నెలల పాటు ఆయన గుంటూరు జైల్లోనే గడిపారు. మొన్న ఆ మధ్యన బెయిల్ పై విడుదలయ్యారు. అయితే ఇటీవల మరో కేసులో అరెస్టయ్యారు. అయితే సురేష్ ఎంపీగా ఉండగా ఆయన భార్య బేబీ లత ఎన్నడూ బయటకు రాలేదు. ఆయన అరెస్ట్ అయిన తర్వాత తరచూ జైలుకు రావడం, బెయిల్ ప్రయత్నాలు చేయడం వంటివి చేస్తూ వస్తున్నారు. అయితే ఆమె ఓ మహిళ న్యాయవాదితో చేసిన సంభాషణ ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని.. మీరు హోం మంత్రి అవుతారని ఆ న్యాయవాది చెప్పిన ఆడియో రాజాగా వైరల్ అవుతోంది. అయితే మీరు ఒక్కరే కాదు చాలామంది అలానే అంటున్నారని.. అలా అనడం చాలా ఆనందంగా ఉందని బేబీ లత బదులు వారి మాటల మధ్యలో ఈసారి సురేష్ బదులుగా బేబీ లతకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తారని.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాష్ట్ర హోం మంత్రి అవుతారంటూ ఆ న్యాయవాది చెప్పినట్లు ఆ ఆడియో లో ఉంది. అదే సమయంలో తాను సురేష్ తో ములాకత్ అయ్యేందుకు జైలుకు వెళ్లగా.. అక్కడ గతంలో తనతో దురుసుగా వ్యవహరించిన ఓ సి ఐ కూడా ఇదే మాదిరిగా అన్నారని బేబీ లతా చెప్పుకొచ్చారు.

# డీఎస్సీలో ఒక్కో పోస్టుకు 25 మంది పోటీ

విజయవాడ, మే 23,డీఎస్సీ పరీక్షా కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. గడువుకంటే ముందే పరీక్షలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రోజుకి 40 నుంచి 50 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఐయాన్ కేంద్రాలు ఎంపిక పూర్తయ్యింది.మెగా డీఎస్సీ-2025 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 15వ తేదీతో ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదు గడువు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికే మొత్తం ఎంత మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారన్న డేటా అధికారుల వద్ద ఉంది. దీంతో పరీక్ష కేంద్రాల ఎంపికపై దృష్టి సారించారు. రోజుకి సరాసరి 40 నుంచి 50 వేల మందికి ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆ మేరకు కేంద్రాలను ఎంపిక చేస్తున్నారు.అధికారిక సమాచారం మేరకు.. ఇప్పటి వరకు అన్ని రకాల పరీక్ష కేంద్రాలు నిర్వహిస్తున్న టీసీఎస్ అయాన్ వారితో అధికారులు సంప్రదింపులు జరిపారు. జూన్ 6 తేదీ నుంచి జరగనున్న డీఎస్సీ పరీక్షలకు తమ కేంద్రాలను ఇచ్చేందుకు ఈ సంస్థ అంగీకరించింది. ఈ కేంద్రాలతోపాటు.. రాష్ట్రంలోని ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కూడా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వారితోకూడా సంప్రదింపులు జరిపారని తెలిసింది.డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎలాంటి డీవియేషన్స్, షెడ్యూల్ మార్పులు లేకుండా.. అధికారులు ముందుకెళ్తున్నారు. వారి స్పీడ్ చూస్తుంటే.. పరీక్షల కోసం ఇచ్చిన 30 రోజుల షెడ్యూల్ కంటే ముందే పూర్తిచేసేలా ఉన్నారు. ఇప్పటికే టీసీఎస్ అయాన్ కేంద్రాలు ఎంపిక చేయగా.. వాటి సామర్థ్యం రోజుకి సరాసరి 20 వేల మందికి రెండు విడతల్లో పరీక్షలు నిర్వహించగలరు. వీటితోపాటు ఇంజినీరింగ్ కళాశాలలు అందుబాటులోకి వస్తే.. మరో 20 నుంచి 30 వేల మందికి ఒకేరోజు పరీక్షలు జరిపే వెసులుబాటు ఉంటుంది. ఈ లెక్కన రోజుకి 40 వేల మంది చొప్పున చూసుకున్నా.. గరిష్టంగా 20 రోజులు కూడా పరీక్షల నిర్వహణకు ఎక్కువే అని అధికారులు చెబుతున్నారు.ఎస్సీ వర్గీకరణ ఈ డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. ఆ మేరకు పోస్టులను ప్రకటించగా.. ఎంత మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు అన్నది కూడా అధికారులు తెలియజేశారు. ఎస్సీ జీఆర్ 1, జీఆర్ 2, జీఆర్ 3 కింద మూడు కేటగిరీల్లో వరుసగా.. 1,848, 45,419, 61,905 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. మొత్తం 16,347 ఉద్యోగాలకు 3,35,401 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు కలిపి 5,77,417 దరఖాస్తులను నమోదు చేశారు.ఒక్కో పోస్టుకు సరాసరి 35 మంది పోటీ పడనున్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్ల నమోదులో మహిళలు ముందంజలో ఉన్నారు. దాదాపు 2,03,647 మంది మహిళా అభ్యర్థులు, 1,31,754 మంది పురుషుల నుంచి దరఖాస్తులు వచ్చినట్లు ఎస్సీఆర్టీ డైరెక్టర్, డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడించారు. ఈ నెల 30వ తేదీ నాటికి హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఆయన చెప్పారు.డీఎస్సీ పోస్టులు అధికంగా ఉన్న కర్నూలు జిల్లాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి భారీగా దరఖాస్తులు నమోదయ్యాయి. మొత్తం 2678 పోస్టులు ఉండగా.. 39,997 మంది అభ్యర్థుల నుంచి మొత్తం 73,605 అప్లికేషన్లు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో మొత్తం పోస్టులు 673 ఉండగా... 15,993 మంది అభ్యర్థుల నుంచి 28,772 అప్లికేషన్లు వచ్చాయి. ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాల నుంచి 7,159 మంది అభ్యర్థుల నుంచి 10,143 అప్లికేషన్లు వచ్చాయి.

# నోరు తెరుస్తున్న సీనియర్లు...

కాకినాడ, మే 23,తెలుగుదేశం పార్టీలో అక్కడక్కడ అసంతృప్తులు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మంత్రి పదవులు ఆశించి భంగపడ్డ సీనియర్ ఎమ్మెల్యేలు నోరు తెరుస్తున్నారు. తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు తెలుగుదేశం పార్టీ మహానాడు కడపలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ ఆదేశించింది. ఈ తరుణంలో తూర్పుగోదావరి జిల్లా టిడిపి మినీ మహానాడులో ఆ పార్టీ నేతలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా జనసేనతో వస్తున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా పార్టీ ముఖ్య నేత జ్యోతుల నెహ్రూ చేసిన కామెంట్స్ ఇప్పుడు సంచలనంగా మారాయి.జనసేనకు అగ్ర తాంబూలం.. తూర్పుగోదావరి జనసేనకు పట్టున్న జిల్లా. ఆపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం గా సైతం ఉన్నారు. అందుకే అక్కడ జనసేనకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. నామినేటెడ్ పదవుల్లో సైతం పెద్దపీట వేస్తున్నారు. జనసేనతో పోల్చుకుంటే టిడిపికి అక్కడ అవకాశాలు తగ్గాయి. దీనిని అక్కడ టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. వారు నేరుగా ఎమ్మెల్యేల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలు సైతం కలవరపాటుకు గురవుతున్నారు.ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన మహానాడు కాకినాడలో జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అయితే తన మనసులో ఉన్న ఆవేదనను బయటపెట్టారు. కాకినాడ జిల్లాలో పదవులు ఏ పార్టీకి వెళ్లాయో ఆలోచించాలని సూచించారు. మెజారిటీ ఉన్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏంటో ఆలోచించాలని వ్యాఖ్యానించారు. ఇటీవల జనసేనకు చెందిన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుకు రెండు పదవులు ఇచ్చారు. పేరు పెట్టకుండా దానిని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తికి రెండు పదవులు అవసరమా అని ప్రశ్నించారు. పార్టీ నిర్ణయాల వల్ల టిడిపి నిర్వీర్యం అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ఎన్నాళ్ళు ఉంటుంది.. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకోలేదని చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు బయటకు రాలేదు అంటూ వ్యాఖ్యానించారు. టిడిపి తో పొత్తు వల్ల కమ్యూనిస్టు పార్టీలు నిర్వీర్యం అయిపోయాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే పరిస్థితి టిడిపికి రాకుండా చూడాలని జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. అయితే గత కొద్దిరోజులుగా జ్యోతుల నెహ్రూ పార్టీ పై అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే ఈ కామెంట్స్ చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి.ఇంకోవైపు కాకినాడ టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేసిన కామెంట్ సైతం సంచలనంగా మారాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టిడిపి ఇన్చార్జ్ ప్రకటించక పోవడాన్ని తప్పుపట్టారు. ఆ నియోజకవర్గంలో జనసేనకు భారీ మెజారిటీ లభించడం వెనుక టిడిపి కార్యకర్తలు ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకో లేకపోతే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని కూడా వ్యాఖ్యానించారు. అయితే జనసేన విషయంలో సలహాలు ఇస్తూనే టిడిపి నేతలు సంచలన వ్యాఖ్యలు చేస్తుండడం కూటమిలో విభేదాలకు కారణమవుతోంది.

# టీడీపికి దూరంగా టాలీవుడ్

ఏలూరు, మే 23, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రెండు సార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ, రెండు సార్లు విభజిత ఏపీలోనూ ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలను స్వీకరించారు. చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చి దాదాపు యాభై ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన కు తొలి నుంచిటాలీవుడ్ తో మంచి సంబంధాలున్నాయి. అసలు ఆ మాటకొస్తే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు టాలీవుడ్ లో అగ్రస్థానంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగి చివరకు పార్టీ ని పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీకి, టాలీవుడ్ కు మధ్య సంబంధాలు దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రారంభమైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు కూడా కొనసాగించారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా టాలీవుడ్ కు చెందిన వారిలో ఎవరో ఒకరు రాజ్యసభ లేదా పార్లమెంటు సభ్యులుగానో ఉండేవారు. ఎన్నికల ప్రచారంలోనూ టాలీవుడ్ నుంచి ఆయనకు సహకారం అందేది. చంద్రబాబు అంటే టాలీవుడ్ కు ప్రత్యేక అభిమానం ఉంది. అదే ఆయనను టాలీవుడ్ కు దగ్గర చేసింది. ఎన్నికల ప్రచారంలో దశాబ్దాల క్రితం సినిమాల్లో యాడ్స్ తో పాటు పాటలు వంటివి కూడా టాలీవుడ్ నుంచి వచ్చేవి. దర్శకులు, నిర్మాతలు, నటులు ఇలా 24 ఫ్రేమ్స్ నుంచి ఆయనకు వెన్నంటే ఉండేవారు. అలాగే ఆయన ఎప్పుడు అధికారంలోకి వచ్చినా టాలీవుడ్ నుంచి వచ్చి అందరూ కలిసేవారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కలసి అభినందనలుచెప్పి వెళ్లేవారు.. అంతేకాదు చంద్రబాబు కూడా వివిధ నామినేటెడ్ పోస్టుల్లో టాలీవుడ్ కుచెందిన వారిని నియమించేవారు. 2014 లో అధికారంలోకి వచ్చినప్పుడు కూడా ఎస్వీబీసీ ఛానల్ కు ఛైర్మన్ గా దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావును నియమించేవారు. నాడు మురళీ మోహన్ ఎంపీగా ఉండటంతో ఆయన అంతా తానే అయి టాలీవుడ్ ను చంద్రబాబు చెంతకు చేర్చేవారు. అలాగే రాజేంద్ర ప్రసాద్ వంటి నటులు కూడా వచ్చి చంద్రబాబును కలసి తమ సమస్యలను విన్నవించుకునే వారు. అలాంటిది కూటమి ప్రభుత్వం 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టాలీవుడ్ నుంచి చంద్రబాబు వద్దకు వచ్చిన వారు తక్కువేననిచెప్పాలి. హైదరాబాద్ కు వచ్చినప్పుడు కలవడమే తప్ప ప్రత్యేకంగా అమరావతికి వచ్చి కలిసిన వారు ఎవరూ లేరు. దీనికి ప్రధాన కారణం జనసేన అధినేత పవన్ కల్యాణ్. టాలీవుడ్ ను శాసిస్తున్న మెగా కుటుంబానికి చెందిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా ఉండటం, సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేశ్ కూడా ఉండటంతో చంద్రబాబు ఇక తనంతట తానే టాలీవుడ్ కు దూరమయినట్లు అంటున్నారు. పవన్ కల్యాణ్ అంటేనే టాలీవుడ్ కు చెందిన వారు కలుస్తారు. ఆయనకు సినీరంగంలో ఉన్న పరిచయాలతో ఆ పరిశ్రమలో ఉన్న సమస్యలు కూడా తెలుసు. అందుకే ఆ విషయాల్లో తాను జోక్యం చేసుకోవడం అనవసరమని భావించి చంద్రబాబు టాలీవుడ్ కు దూరంగా ఉంటున్నారనితెలిసింది.నిర్ణయంతీసుకున్నా పవన్ కల్యాణ్ హర్ట్ అవుతారేమో నని భావించి చంద్రబాబు తెలుగు చలన చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. నిజంగా నలభై ఏళ్ల తర్వాత చంద్రబాబు టాలీవుడ్ కు దూరమయ్యారా? టాక్ మాత్రం చిత్ర పరిశ్రమలో బలంగా వినిపిస్తుంది.

# భూమా...గీతా దాటేస్తోందా...

కర్నూలు, మే 23 ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు.వివాదాస్పద నియోజకవర్గాలపై టిడిపి నాయకత్వం దృష్టిపెట్టిందా? అక్కడ ఎమ్మెల్యేలతో నష్టం జరుగుతోందని గుర్తించిందా? అందుకే దిద్దుబాటు చర్యలకు దిగనుందా? వారి స్థానంలో ఇంచార్జ్ లకు బాధ్యతలు అప్పగించనుందా? అంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి తీవ్ర నష్టం జరుగుతున్న నియోజకవర్గాలపై టీడీపీ హై కమాండ్ దృష్టి పెట్టినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 11 అసెంబ్లీ నియోజకవర్గాలలో కొత్త ఇన్చార్జిలను నియమించడానికి కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ఎక్కువగా రిజర్వుడ్ నియోజకవర్గాలు ఉండడం విశేషం.ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. క్రమశిక్షణతో ఉండాలని సూచిస్తున్నారు. అయినా సరే కొందరు ఎమ్మెల్యేల తీరులో మార్పు రావడం లేదు. ఈ క్రమంలోనే కఠిన చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తిరువూరు, రైల్వే కోడూరు, రాజంపేట, సింగనమల, ఆళ్లగడ్డ నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తరచు వివాదాల్లో చిక్కుకోవడం పార్టీకి మైనస్ గా మారింది. అందుకే చాలాసార్లు హెచ్చరించినా.. ఫలితం లేకపోవడంతో వారి స్థానంలో ఇన్చార్జిలను తెస్తారని తెలుస్తోంది. అదే జరిగితే విభేదాలు మరింత ముదరడం ఖాయం.నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోఎమ్మెల్యే అఖిల ప్రియ పరిస్థితి మరింత వివాదంగా మారుతోంది. ఇక్కడ సొంత పార్టీ శ్రేణులే ఆమె తీరును వ్యతిరేకిస్తున్నారు. అందుకే సీఎం చంద్రబాబు తో పాటు మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇక్కడ టిడిపి సమన్వయకర్తగా చింతకుంట శ్రీనివాసరెడ్డి నియమించడానికి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శ్రీనివాస్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉంది. ఈయన తాత సిపి తిమ్మారెడ్డి గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎమ్మెల్యే అఖిలప్రియ కు సమీప బంధువు కూడా. అఖిల ప్రియ తీరు రోజురోజుకు వివాదంగా మారడంతో.. ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని చూసుకోవాలని టిడిపి హై కమాండ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా శ్రీనివాస్ రెడ్డిని ఇన్చార్జిగా నియమిస్తారని సమాచారం. శ్రీనివాసరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. హైదరాబాద్ తో పాటు రాజమండ్రిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుతున్నారు. ఇటీవల కాలంలో చికెన్ సెంటర్ ల నుంచి కూడా అఖిలప్రియ అనుచరులు కమిషన్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు టిడిపి ప్రతిష్టను మరింతఇబ్బందుల్లో పెట్టాయి. స్థానిక పార్టీ శ్రేణులు సైతం అఖిలప్రియ తీరుపై హై కమాండ్కు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ క్రమంలో టిడిపి పెద్దలు అక్కడ నాయకత్వం మార్పుతోనే వ్యతిరేకత తగ్గించుకోవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. శ్రీనివాస్ రెడ్డికి ఆళ్లగడ్డ నియోజకవర్గం అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

# ఈ చిట్కాలను పాటించండి.. మీ వయసును బట్టి వెన్నెముకను మెరుగ్గా తయారు చేసుకోండి..





మన శరీరంలోని గుండె తర్వాత అత్యంత ముఖ్యమైన వాటిలో ఇదొకటి. ఇది లేనిదే మనం కూర్చోలేము. సరిగ్గా నిలబడలేము. అదేంటంటే వెన్నెముక. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరు ఉద్యోగస్తులైనా, విద్యార్థులతో పాటు ఇతరులు ఎవరైనా వారి వారి పనుల్లో ఇది సక్రమంగా ఉంటేనే అన్ని పనులు సక్రమంగా జరుగుతాయి. లేదంటే ఇబ్బందులు తప్పవు. వయసు పెరిగేకొద్ది దీనిమీద ప్రభావం ఎక్కువగా పడుతూ ఉంటుంది. సాధారణంగా 40 ఏళ్లు దాటాక దీని ప్రభావం ఉంటుంది. కానీ ప్రస్తుతం ఈ వెన్నెముక దెబ్బకు 30 ఏళ్ల వయసులోనే వృద్ధాప్యం ప్రారంభమవుతోంది. ఇది ఎలా జరుగుతుందంటే వెన్నెముక కాలంతో దాని స్థితిస్థాపకతను కోల్పోయినప్పుడు మీరు తీవ్రమైన వెన్నునొప్పిని అనుభవిస్తారు, ఇది మీ జీవన నాణ్యతను క్షీణిస్తుంది. అంతేకాదు మీ రోజువారీ పనులకు కూడా తీవ్ర ఆటంకం కలిగిస్తుంది.



ఇలాంటి ఆటంకాలను అవలీలగా ఎదుర్కొనేందుకు ఈ చిట్కాలను పాటించండి. మీ వెన్నెముకను పది కాలాల పాటు భద్రంగా కాపాడుకోండి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, వెన్నెముక నొప్పికి ప్రధాన కారణం వెన్నెముక వ్యాధులు, ఇవి వాపు, చంచలత. ఇవి వెన్నెముక యొక్క కదలికను తగ్గిస్తాయి.. యాక్టివ్ గా ఉండండి... యాక్టివ్ గా ఉండండి..వెన్నెముక, ఎముక, గుండె మరియు శరీర భాగాల ఆరోగ్యానికి చురుకుగా ఉండటం చాలా ముఖ్యం. మీరు ఎంత చురుకుగా ఉంటారో మీ వెన్నెముక ఆరోగ్యానికి అంతే దోహదం చేస్తుంది. వ్యాయామశాలకు వెళ్లండి. ఈత కొట్టండి. రోజు కొద్ది దూరం నడవండి. పిల్లలతో కలిసి ఆడుకోండి లేదా మిమ్మల్ని మీరు చురుకుగా ఉంచడానికి మరియు జీవితానికి సక్రమంగా ఉండటానికి ఏదైనా చిన్న పని చేయండి2. స్థిరత్వాన్ని మెరుగుపరుచుకోండి.. 2. స్థిరత్వాన్ని మెరుగుపరుచుకోండి..మీ వెన్నెముక ఆరోగ్యాన్ని ప్రోత్సహించేటప్పుడు వశ్యత ముఖ్యం. ప్రతిరోజూ సాగదీయడం మిమ్మల్ని సరళంగా చేస్తుంది. ఇది సాధారణ ఉమ్మడి విధులను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది గట్టి కండరాల నుండి ఉపశమనం ఇస్తుంది.మీ శరీర స్థిరత్వాన్ని మెరుగుపరుస్తుంది. మంచి నిద్ర భంగిమ ముఖ్యం..3. మంచి నిద్ర భంగిమ ముఖ్యం..ప్రతిరోజూ ఎన్ని పనులు చేస్తూ, అనేక రకాలుగా కష్టపడే మీరు మీ శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి.



మరుసటి రోజుకు అందులో చైతన్యం నింపాలి. దీనికి దిండు మరియు మంచం సౌకర్యవంతంగా ఉంటే ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి, ఎందుకంటే అవి వెన్నెముకను సౌకర్యవంతమైన రీతిలో విశ్రాంతి తీసుకోవడానికి అనుమతిస్తాయి. వెన్నెముకపై ఒత్తిడిని నివారించడానికి కడుపు ద్వారా కాకుండా పక్కకి తిరిగి నిద్ర పోయేందుకు ప్రయత్నించండి.4. ఎక్కువ బరువులు ఎత్తొద్దు..4. ఎక్కువ బరువులు ఎత్తొద్దు..మీరు ప్రతిరోజూ మీ శరీర బరువులో 25% కంటే ఎక్కువ బరువులు ఎత్తడం మానుకోవాలి ఎందుకంటే ఇది వెన్నెముకకు చాలా ఇబ్బంది కావచ్చు లేదా హెర్నియేటెడ్ డిస్క్ కలిగిస్తుంది. ఒకవేళ మీరు ఒక భారీ వస్తువును ఎత్తబోతున్నట్లయితే, నడుము నుండి కాళ్ళ నుండి క్రిందికి వంగి, బరువును నెమ్మదిగా ఎత్తండి. లేదంటే అనేక వెన్నెముక సమస్యలకు దారితీయవచ్చు కాబట్టి దాన్ని ఎప్పుడూ కుదుపులో ఎత్తకండి. ప్రతిరోజూ వ్యాయామంతో.. 5. ప్రతిరోజూ వ్యాయామంతో..మన వెన్నెముకకు వ్యాయామం మద్దతు ఇస్తుంది. దీని వల్ల ఉదర కండరాలు బలంగా ఉంటాయి. వస్తువులను నిలబెట్టడానికి మరియు ఎత్తడానికి మనకు సహాయపడతాయి. వృద్ధాప్యం వరకు మీకు మద్దతు ఇచ్చే బలమైన కండరాలను




నిర్మించడానికి వంతెన వ్యాయామం మరియు కటి వంపు వంటి రోజూ వ్యాయామం చేయండ.6.సరైన బూట్లు వేసుకోండి.. 6.సరైన బూట్లు వేసుకోండి..వెన్నెవక యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో బూట్లు తక్కువ ప్రాముఖ్యత ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ వెనుక భాగానికి మద్దతు ఇవ్వడానికి మరియు మంచి సహాయక స్థావరాన్ని అందించడం ద్వారా వెన్నెముక మరియు శరీరాన్ని సమర్థవంతం చేయడానికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గట్టి లేదా అతిగా వదులుగా ఉండే బూట్లు ధరించడం మానుకోండి. మడమల వెనుక నుండి సరిగ్గా సరిపోయే వాటిని ధరించండి.) మొబైల్ వాడటంలో జాగ్రత్త..7) మొబైల్ వాడటంలో జాగ్రత్త..మొబైల్‌ను మన శరీరంలోని తప్పుడు స్థానాల్లో ఉపయోగించడం అనారోగ్యకరమైన అలవాటు, ఈ రోజుల్లో పెద్ద సంఖ్యలో చాలా మంది యొక్క వెన్నెముకను ఇది ప్రభావితం చేస్తుంది. చాలా మంది ప్రజలు తమ మొబైల్‌ను నిరంతరం కొన్ని స్థానాల్లో ఉంచడం వల్ల తీవ్రమైన వెన్నెముక నొప్పి వస్తుంది. అధిక వంపును నివారించడానికి మీ ఫోన్‌ను కంటి లేదా ఛాతీ స్థాయిలో ఉంచండి. ఎల్లప్పుడూ నేరుగా కూర్చుని మొబైల్ వాడండి.8) రెస్ట్ తీసుకోండి.. ఆ8) రెస్ట్ తీసుకోండి..ఒకే స్థితిలో నిరంతరం పనిచేయడం వలన అలసట వస్తుంది. ఇది మన వెన్నుపాముకు హానికరం. కార్యాలయంలో తరచుగా స్థానాలను మార్చండి, మీ సౌకర్యానికి అనుగుణంగా కార్యాలయ కుర్చీని సర్దుబాటు చేయండి. స్క్రీన్ వైపు ముందుకు సాగకండి. వెన్నెముకకు కంఫర్ట్ గా ఉండేలా పని చేయండి. ప్రతి 20-30 నిమిషాలకు నడవడం మర్చిపోవద్దు.9. చిరోప్రాక్టర్ తో సంప్రదింపులు..9. చిరోప్రాక్టర్ తో సంప్రదింపులు..మీ చిరోప్రాక్టర్‌తో రెగ్యులర్ సంప్రదింపులు తప్పనిసరి చేయాలి. ఎందుకంటే మీ వెన్నెముకను బలంగా మరియు ఆరోగ్యంగా ఉంచడానికి ఉత్తమమైన నిద్ర స్థానాలు మరియు ఇతర సర్దుబాట్లను అర్థం చేసుకోవడానికి ఇది మీకు సహాయపడుతుంది. సరైన మందులతో హెచ్చరిక సంకేతాలను అర్థం చేసుకోవడంలో కూడా ఇవి సహాయపడతాయి10. మంచి ఆహారం తీసుకోండి..10. మంచి ఆహారం తీసుకోండి..


మీ వెన్నెముకను ఆరోగ్యంగా మరియు బలంగా ఉంచడానికి మీ ఆహారంలో చేపలు, పాల ఉత్పత్తులు, అవోకాడో మరియు మొక్కల ఆధారిత ప్రోటీన్లను చేర్చండి. మీరు ఊబకాయం కలిగి ఉంటే, ఎక్కువ బరువు మీ వెన్నెముకపై ఒత్తిడి తెచ్చి నొప్పిని కలిగించవచ్చు కాబట్టి మీ శరీర కొవ్వును తగ్గించడానికి ప్రయత్నించండి.11)

చెడు అలవాట్లను వదిలేయండి..11) చెడు అలవాట్లను వదిలేయండి..ఆరోగ్యకరమైన వెన్నెముకను కాపాడుకోవడానికి, ధూమపానం, మద్యం సేవించడం మరియు మాదకద్రవ్య దుర్వినియోగం వంటి అన్ని చెడు అలవాట్లను మానుకోండి. ఇవి రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. వీటివల్ల ఎముకలు మరియు వెన్నుపాము బలహీనపడతాయి. అలాగే, ఇది అనేక క్షీణించిన వెన్నెముక డిస్క్ వ్యాధులు మరియు ప్రారంభ వెన్నెముక ఆర్థరైటిస్ అభివృద్ధికి దారితీస్తుంది.ఈ చిట్కాలను పాటించండి.మీ వెన్నెముకను బలపరుచుకోండి.. మీరు కలకాలం ఆరోగ్యంగా జీవించండి.

# కిడ్నీలో రాళ్ళు: వంటగదిలోని ఈ పదార్థాలు చాలు కరిగించడానికి



మానవ శరీరం ఒక స్వయం చోదక యంత్రం లాంటిది. మానవ నిర్మిత యంత్రం ఎలా వివిధ భాగాల నుండి మిగిలిని అన్ని భాగాలను ఆధారంగా పనిచేస్తుంది. ఈ యంత్రం దాని స్వంత పనులను కలిగి ఉన్నట్లే ఇది ఎముకతో నిండిన మనిషి శరీరమనే యంత్రాన్ని సమగ్రంగా మరియు విజయవంతంగా ఆపరేట్ చేయడానికి సహాయపడుతుంది. శ్వాస కోసం ఊపిరితిత్తులు, పని కోసం చేతులు, నడక కోసం కాళ్ళు, జా&ఝపకశక్తికి కోసం మెదడు, రక్త కదలికకు గుండె, చూడటానికి కళ్ళు మొదలైనవి వాటికి మరిన్ని అవయవాలు తనలో చేర్చుకోబడినవి. మరియు ఆ అవయవాలు ఉండే వరకు వాటి పనితీరును చక్కగా నిర్వహిస్తాయి. ఒక అవయవం తన పనిని తాను చేయడానికి సంకోచించినప్పుడల్లా ప్రభావం మొత్తం శరీరంపై ఉంటుంది.ఈ రోజు మనం మాట్లాడబోయేది ఏమిటంటే మూత్రపిండాలు. మూత్రపిండాలు శరీరంలో అతి ముఖ్యమైన అవయవం మరియు మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవంగా పిలిచే ఈ కిడ్నీలు శరీరంలోని ముఖ్యంగా రక్తంలోని మలినాలను శుద్ధి చేయడానికి వాటిని బహిర్గతం చేయడం ద్వారా మొత్తం శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి సహాయపడుతుంది. మానవ నిర్మిత యంత్రాలు ఎప్పటికప్పుడు వాటి



సామర్థ్యాన్ని కాపాడుకునే విధంగా మన శరీరం యొక్క అంతర్నిర్మిత అవయవాల రక్షణకు కూడా మనము బాధ్యత వహిస్తాము. మన అవయవాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలో మనందరికీ తెలుసు. మన మొత్తం ఆరోగ్యం కోసం రోజుకు ఇరవై నాలుగు గంటలు మన శరీర అంతర్గత అవయవాలను ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి? ఇది ఇబ్బందికరమైన ప్రశ్నే అయినా చింతించకండి . ఈ వ్యాసంలో మేము మీకు చెప్పబోయే విషయమేమిటంటే మీరు ఎల్లప్పుడూ ఆసుపత్రి మెట్లు ఎక్కాల్సిన అవసరం లేదు. మన ఇంట్లోలో ముఖ్యంగా మన వంటగదిలో మనకు లభించే పదార్థాలతోటే మన అంతర్గత అవయవాలను శుభ్రంగా ఉంచుకోవచ్చు.కిడ్నీ స్టోన్స్ సమస్యను సాధారణ హోం రెమెడీస్‌తో ఎలా పరిష్కరించగలరు?కిడ్నీ స్టోన్స్ సమస్యను సాధారణ హోం రెమెడీస్‌తో ఎలా పరిష్కరించగలరు?ఎల్లప్పుడూ సమర్థవంతంగా పనిచేస్తున్న మన మూత్రపిండాలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి? మొదటి మరియు అతి ముఖ్యమైన సమస్య మూత్ర పిండాల్లో రాళ్లు ఏర్పడటం. అవును మూత్రపిండాలలో రాళ్ళు ఉత్పత్తి అవుతాయి మరియు ఇవి చాలా సమస్యలకు దారితీస్తాయి. ఈ రకమైన సమస్యలు మనం అనుకున్నదానికంటే ఎక్కువగా కనిపిస్తాయి. నేషనల్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఔఅఃఎ)అభిప్రాయం ప్రకారం మొత్తం భారతీయ జనాభాలో మూడింట ఒక వంతు సుమారు 12% మందికి ఈ సమస్య ఉంది మరియు వారిలో 50% మందికి ఈ సమస్య ఉందని ఎటువంటి ఆధారాలు లేవు. ఎందుకంటే వీరికి అలాంటి ఏ చిన్న సూచనలు కనబడలేదు. కిడ్నీలో రాళ్ళు వీరికి పెద్ద సమస్యగా ఉంటాయి మరియు చికిత్స చేయకపోతే మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది.



కిడ్నీ రాళ్ళు అంటే ఏమిటి?

కిడ్నీ రాళ్ళు అంటే ఏమిటి?

కిడ్నీలో రాళ్ళు , మూత్రపిండాలలో ఏర్పడే ఒక రకమైన కఠినమైన పదార్థం. ఇవి బయట నుండి వచ్చి చేరిన పదార్థం కాదు. మన ప్రతి నిత్యం సేవించే లవణాలు మరియు ఖనిజాల యొక్క "కాల్షియం ఆక్సలేట్" అనే పదార్థమే ఇలా ఘన రూపంలోకి మార్చబడతాయి. ఈ ఖనిజ లవణాలు మూత్ర నాళాల్లో చేరి మలినాలను మూత్రపిండాల నుండి విడుదల చేయకుండా అడ్డుకుంటాయి. ఇది మన శరీరానికి చాలా బాధను కలిగిస్తుంది మరియు అనారోగ్యాలు మొదలవుతాయి. మూత్రపిండాల్లోని రాళ్ళు మూత్రాశయం గుండా వెళ్ళాలి మరియు బయటకు వెళ్ళేటప్పుడు చాలా బాధాకరంగా ఉంటాయి. మూత్రపిండంలో కనిపించే ఈ రకమైన రాళ్లను వైద్య భాషలో "కాల్సీ" లేదా "యురోలిథియాసిస్" పిలవబడుతుంది.

మూత్రపిండంలో రాళ్ల ఉత్పత్తికి ప్రధాన కారణం ఏమిటో మీకు తెలుసా?

మూత్రపిండంలో రాళ్ల ఉత్పత్తికి ప్రధాన కారణం ఏమిటో మీకు తెలుసా?

మన శరీరం రక్తం మరియు నీటితో నిండి ఉంటుంది. రెండూ ద్రవ రూపం కాబట్టి మనం తీసుకునే ఆహారంలో ఉప్పు మరియు ఖనిజాల సమ్మేళనాలు త్వరగా జీర్ణమవుతాయి మరియు మిగిలిన మలినాలు మూత్ర మార్గము గుండా వెళతాయి. అందరిలోనూ ఇదే ప్రక్రియ జరుగుతుంది. మనిషి నీటి తీసుకోవడం తగ్గించినప్పుడు ఉప్పు మరియు ఖనిజాల సమ్మేళనాలు దగ్గరకు వచ్చి కొన్నిసార్లు కలిసి ఉండి మూత్రపిండాలలో (కిడ్నీలలో)ఘనరూపంగా ??ఏర్పడతాయి. వీటిని కిడ్నీ స్టోన్స్ అని పిలుస్తారు. కొన్ని సందర్భాల్లో చిన్న రాళ్ళు ఎటువంటి లక్షణాలను చూపించకుండా శరీరం నుండి బయటకు వచ్చేస్తాయి. అయితే కొన్నిసార్లు పెద్ద రాళ్ళు మూత్రపిండాలను వదలకుండా బాధాకరంగా ఉంటాయి.

కాబట్టి మూత్రపిండాల్లో రాళ్లకు ఎలాంటి చికిత్స ఇస్తారు?

కాబట్టి మూత్రపిండాల్లో రాళ్లకు ఎలాంటి చికిత్స ఇస్తారు?

మూత్రపిండాలలో రాళ్ళు ఉన్నాయని మీకు తెలిసిన వెంటనే ఒక్కసారిగా గుండె జల్లు మంటది. ఎందుకంటే మీరు ఎప్పుడూ విననటువంటి ఒక భయంకరమైన విషయం కాబట్టి. కానీ భయపడాల్సిన అవసరం లేదు. మనిషి ఎంత ధైర్యంగా అంటాడో అంతే వీలైనంత త్వరగా సమస్యను నయం చేసుకోవచ్చని వైద్యులు చెబుతు?న్నారు. మొదట ఈ విషయం గురించి వైద్యులు మీతో చెప్పినప్పుడు భయపడకూడదు. ముఖ్యంగా నేటి ఆధునిక యుగంలో చికిత్సకు కొరతేముంది? మూత్రపిండాల్లో రాళ్లను సులభంగా కరిగించే ద్రవరూపంలోని మందులు ఇప్పటికే కనుగొనబడ్డాయి. ఈ విషయంలో హోమియోపతి నివారణలు కూడా బాగా పనిచేస్తాయి. మీరు ఆహారం మార్పులు చేసుకుంటే ఈ సమస్య ఏర్పడకుండా నిరోధించవచ్చు.

మీరు ప్రతి రోజూ తాగే నీరు మీ మూత్రపిండాల(కిడ్నీల)ఆరోగ్యాన్నికాపాడుతుంది..

మీరు ప్రతి రోజూ తాగే నీరు మీ మూత్రపిండాల(కిడ్నీల)ఆరోగ్యాన్నికాపాడుతుంది..

మనిషి జీవితానికి అవసరమైన పదార్థాలలో నీరు ఒకటి మరియు అందరికీ సులభంగా లభిస్తుంది. అందుకే మనిషి ఎంత ఎక్కువ నీరు సేవిస్తే అంత మంచిది. శరీరం లోపలి జీర్ణక్రియ సరిగా పనిచేస్తుంది మరియు మన ఆహారంలో తీసుకునే విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు మరియు కార్బోహైడ్రేట్లు మన శరీరం సరిగ్గా ఉపయోగించుకుంటాయి. 12 గ్లాసుల నీరు తీసుకోవడం ఆరోగ్యానికి ఉత్తమ పరిష్కారం. నీరు ఎక్కువగా తాగడం వల్ల మన మూత్రనాళాల్లో ఉన్న అతి చిన్న రాళ్ళను విజవయంతంగా బయటకు విసర్జించపబడేలా చేస్తుంది.



నిమ్మరసం లేదా లెమన్ జ్యూస్ మీ మూత్రపిండాల ఆరోగ్యానికి రక్షక కవచంనిమ్మరసం లేదా లెమన్ జ్యూస్ మీ మూత్రపిండాల ఆరోగ్యానికి రక్షక కవచంఅవును నిమ్మరసం నిజంగా మూత్రపిండాల్లో రాళ్లతో బాధపడేవారికి రామ బాణం. నిమ్మకాయలోని "సిట్రేట్" కంటెంట్ మన శరీరంలో కాల్షియం ఖనిజ గట్టిపడటాన్ని సులభంగా నిరోధిస్తుంది. అందువల్ల మీరు అల్పాహారం ముందు ఖాళీ కడుపుతో ఒక గ్లాసు నిమ్మరసం తాగడం ప్రాక్టీస్ చేస్తే మీరు కిడ్నీ స్టోన్స్ సమస్యను నివారించవచ్చు.తులసీ దళాలు లేదా తులసి మొక్క నుండి సేకరించిన ఆకులు మీ మూత్రపిండాలకు మంచి స్నేహితుడుతులసీ దళాలు లేదా తులసి మొక్క నుండి సేకరించిన ఆకులు మీ మూత్రపిండాలకు మంచి స్నేహితుడుతులసి ఆకులోని కొన్ని పదార్థాలు మన శరీరంలోని "యూరిక్ యాసిడ్" ను స్థిరీకరించడంలో విజయవంతమయ్యాయని కొన్నిపరిశోధనలలో కనుగొన్నారు. యూరిక్ యాసిడ్ స్థాయిలు స్థిరంగా ఉంటే మూత్రపిండాలలో రాళ్ల నిర్మాణం తగ్గుతుంది. విషపూరిత ఆకులోని కొన్ని అంశాలు మన శరీరం యొక్క "యూరిక్ యాసిడ్" స్థాయిలను స్థిరీకరించగలిగాయని భౌతిక పరిశోధనలో తేలింది. యూరిక్ యాసిడ్ స్థాయిలు స్థిరంగా ఉన్నప్పుడు, మూత్రపిండాలలో రాళ్ల నిర్మాణం తగ్గుతుంది. తులసి ఆకులలో "ఎసిటిక్ యాసిడ్" కంటెంట్ ఉన్నందున మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడంలో ఇది గొప్ప పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ ఒక టీస్పూన్ తులసి రసం తినడం వల్ల మీ కిడ్నీ ఆరోగ్యం మెరుగుపడుతుంది.మీ ఇంటిల్లిపాదికి డాక్టర్ ఆపిల్ సైడర్ వెనిగర్

మీ ఇంటిల్లిపాదికి డాక్టర్ ఆపిల్ సైడర్ వెనిగర్ఆపిల్ సైడర్ వెనిగర్ లోని "ఎసిటిక్ యాసిడ్" కంటెంట్ తులసి ఆకుతో సమానంగా ఉంటుంది. మీరు భోజనానికి ముందు ప్రతిరోజూ ఒక టేబుల్ స్పూన్ ఆపిల్ సైడర్



వెనిగర్ ను నీటితో కలిపి సేవిస్తే మీకు కిడ్నీలో రాళ్ళు ఉంటే శరీరంలో చాలా త్వరగా కరిగిపోయేలా చేస్తుంది.వీట్‌గ్రాస్ రసం లేదా గోధుమ గడ్డి రసంవీట్‌గ్రాస్ రసం లేదా గోధుమ గడ్డి రసంగోధుమలు మనిషి ఆరోగ్యాన్ని కాపాడుటలో గతంలో నుండే తనదైన లక్షణాన్ని కొనసాగిస్తూ వస్తోంది. డయాబెటిస్ ఉన్నవారికి గోధుమ పిండి వాడటం వలె గోధుమ గడ్డి మూత్రపిండాల రాళ్లకు కూడా ఉపయోగపడుతుంది. అటువంటి సమస్యకు పిల్ లేదా పౌడర్ బదులు గోధుమ గడ్డి రసం తీసుకుంటే, మూత్రంలో రాళు ళ్ళ చాలా త్వరగా కరిగిపోతాయి. గోధుమ గడ్డిలో "యాంటీఆక్సిడెంట్లు" ఉండటం మూత్ర నాళంలో మూత్రపిండాల్లో రాళ్ళు పేరుకుపోవడాన్ని పూర్తిగా నిరోధిస్తుంది. చూశారుగా !!! మన ఇంట్లో మనకు అవసరమైన వెంటనే ఏఏ వైద్యులు ఉన్నారో. అందుకే పై సూచించిన ఆహారపదార్థాలన్నింటినీ తినండి మరియు మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి



# సినిమా



# కేన్స్ లో విశ్వంభర ఎపిక్ బుక్!




ఇండియన్ మైథాలజీకి ఆధునిక టెక్నాలజీ కలగలిపి రూపొందుతున్న భారీ సినిమాగా విశ్వంభర ఇప్పటికే ఆసక్తి రేపుతోంది. మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా కేన్స్ ఫిలిం ఫెస్టివల్ వేదికగా ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రమోట్ చేయడం మెగా ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్‌గా మారింది. ఈ ఇంటర్నేషనల్ స్టేజ్‌లో 'విశ్వంభర' ప్రాజెక్ట్‌పై ప్రత్యేక ప్రెజెంటేషన్ ఇస్తూ, నిర్మాత విక్రమ్ రెడ్డి ఓ ఎపిక్ బుక్‌ను ఆవిష్కరించారు. ఇందులో సినిమా థీమ్, దాని వెనక ఫిలాసఫీ, ఇండియన్ మైథాలజీ ఎలిమెంట్స్, అలాగే విజువల్ సేకరణలు, ఆర్ట్ వర్క్‌లు ప్రస్తావించబడ్డాయి. సినిమాను ప్రెజెంట్ చేసే విధానం గ్లోబల్ ఆడియెన్స్‌కి కూడా ఆకర్షణీయంగా ఉండేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ బుక్ ప్రస్తుతం "విశ్వంభర పుస్తకం లోపల ఏముంది?" అనే క్యూరియాసిటీకి కారణమవుతోంది. ఈ సందర్భంగా మూవీ ఎఈచీ అంశాలపై కూడా సమాచారం వెల్లడించారు. ప్రముఖ హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ స్టూడియోల సహకారంతో ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయని విక్రమ్ చెప్పారు. సినిమా మొత్తం ప్రామాణికంగా రూపొందించబడుతోంది. 2025లో తెలుగు సినిమా మార్కెట్‌ను ఈ సినిమా కొత్త స్థాయికి తీసుకెళ్లే అవకాశం ఉందన్న టాక్ టోలీవుడ్లో వినిపిస్తోంది. కీరవాణి సంగీతం ఈ సినిమాకి మరో హైలైట్. ఇప్పటికే విడుదలైన రామా రామా సాంగ్ మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. చిత్రంలో త్రిష కథానాయికగా, అశికా రంగనాథ్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీపై అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది. పోస్టర్‌ల నుంచి టీజర్, బుక్ రిలీజ్ వరకు ప్రతి అప్‌డేట్ వేర్వేరు రేంజ్‌లో చర్చనీయాంశమవుతుండగా, ఇక రిలీజ్ ప్రోమోషన్స్ ఎలా ఉంటాయో అన్న ఉత్కంఠతో ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ ఎపిక్ వెనుక ఊఎ క్రియేషన్స్ భారీ ప్లాన్ తో సాగుతోంది. ప్రత్యేకంగా గ్రాఫిక్స్ కోసమే 70 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే రానున్నాయి. ఇక సినిమా విడుదల అనంతరం ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



# వార్ 2 : ఎన్టీఆర్ నెట్టాల్సిందే..?


బాలీవుడ్‌లో అత్యంత భారీగా రూపొందుతోన్న స్పై యూనివర్స్ సినిమా వార్ 2 పై తెలుగులో అభిమానుల అంచనాలు మొదట్లో బాగానే ఉండేవి. హృతిక్ రోషన్ ఎన్టీఆర్ కాంబినేషన్, అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిలింస్ బ్యానర్, స్పై యాక్షన్ నేపథ్యంలో అటు నేషనల్‌గా ఇటు తెలుగు మార్కెట్లోనూ సినిమాపై ఆసక్తి నెలకొంది. కానీ తాజాగా విడుదలైన టీజర్ మాత్రం అందరినీ నిరాశపరిచింది. హృతిక్ స్టైలిష్‌గా కనిపించాడనే దానికంటే ఎన్టీఆర్ పై చూపించిన విజువల్స్, డైలాగ్ డెలివరీపై సోషల్ మీడియాలో భారీగా నెగటివ్ కామెంట్లు రావడం షాక్‌కు గురిచేసిందిలోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తోన్న కూలి బజ్ మాత్రం టాప్ గేర్‌లో ఉంది. "100 డేస్ టు కూలి" వీడియోతో మొదలైన ప్రమోషన్, అనిరుధ్ నేపథ్య సంగీతం, రాజనీ గెటప్.. ఇవన్నీ కలిసి ఈ సినిమాకు పెద్దగా పాజిటివ్ బజ్ తీసుకొచ్చాయి. అలాగే నాగార్జున క్రేజ్ తో కూడా హైప్ గట్టిగానే ఎక్కించారు. ముఖ్యంగా తమిళంతో పాటు తెలుగులోనూ కూలీ ప్రమోషన్ స్పీడ్ పెరిగిపోతుండటం గమనార్హం. ఒక వేళ ఇలాగే కొనసాగితే కూలీ తెలుగు బాక్సాఫీస్ వద్ద వార్ 2 ని దాటేస్తుందనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నది.. వార్ 2 కు తెలుగు మార్కెట్లో హైప్ లోపిస్తున్న విషయం. హృతిక్ నేమ్‌కి ఉత్తరాదిలో మార్కెట్ ఉన్నా, సౌత్‌లో మాత్రం ఎన్టీఆర్ మీదే పూర్తి భారం పడింది. కాబట్టి ఈ నెగటివ్ ట్రెండ్‌ను తిరగమొయ్యాలంటే ఇక నుండి ఎన్టీఆర్ స్వయంగా ప్రమోషన్ బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కేన్స్ ఫెస్టివల్‌లో జాన్వీ సంతోషం, దుఃఖం టీజర్ విఫలమైన నేపథ్యంలో ట్రైలర్‌తో పెద్ద ఎఫెక్ట్ తీసుకురావడమే ఒక్కటే మార్గం. ఆపై మీడియా ఇంటర్వ్యూస్, ఈవెంట్స్, సోషల్ మీడియా అప్‌డేట్స్.. అన్ని దశల్లోనూ ఎన్టీఆర్ ప్రమోషన్ లో ముందుండాలి. ఈ సినిమా ఎన్టీఆర్‌కు ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్. బాలీవుడ్ లో ఫుల్ స్కేల్ ఎంట్రీగా ఈ సినిమాను చూడటం, ఆ స్థాయిలో తన పాత్రకు ప్రాముఖ్యత రావాలన్నదే అభిమానుల ఆశ. కానీ మొదటి మెట్టు అయిన టీజర్ అంచనాలు అందుకోలేకపోవడం ఇప్పుడు ప్రమోషన్ వైపు మరింత శ్రద్ధ అవసరమని చెబుతోంది. ఇక యష్‌రాజ్ ఫిలింస్‌కు సౌత్ మార్కెట్లో ఎప్పటికప్పుడు మద్ధతిచ్చే ఎన్టీఆర్‌లాంటి స్టార్ అవసరం తప్పనిసరి. సాధారణంగా ఈ స్థాయిలో పాన్ ఇండియా సినిమాల్లో తెలుగు మార్కెట్ కోసం డిజైన్ చేసే స్పెషల్ ప్రెజెంటేషన్ ఉంటుంటుంది. కానీ వార్ 2 టీజర్ మాత్రం అక్కడే తడబడింది. ఇది తేలికగా తీసుకునే విషయం కాదు. ఇప్పుడైనా దర్శకుడు అయాన్ ముఖర్జీ, నిర్మాతలు, ఎన్టీఆర్ కలిసి భారీ స్ట్రాటజీతో ప్రమోషన్ స్ట్రాటజీ రూపొందించాలి. లేదంటే కూలీ ముందు వార్ 2 స్పీడ్ తగ్గే అవకాశాలున్నాయి. తెలుగులో సినిమాకి మిగిలిన హైప్ అంతా ఇప్పుడు ఎన్టీఆర్ మీదే ఆధారపడి ఉంది.

# జాన్వీని ఇకపై విమర్శించరు... మొత్తం మారుతుంది!


అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా హిందీలో సరైన హిట్ పడలేదు. తెలుగులో దేవర సినిమాతో ఎంట్రీ ఇచ్చి పర్వాలేదు అనిపించుకుంది. అయితే జాన్వీ కపూర్ కేవలం వారసత్వం వల్ల, అందాల ఆరబోత వల్ల మాత్రమే కెరీర్‌లో కొనసాగుతుందని, నటన ప్రతిభ చూపించడంలో జాన్వీ కపూర్ ప్రతి సినిమాతోనూ విఫలం అయిందని విమర్శిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. జాన్వీ కపూర్ నటన విషయంలో కెరీర్ ఆరంభం నుంచి విమర్శలు ఎదుర్కొంటుంది. కేవలం గ్లామర్ షో కారణంగా ఆఫర్లు సొంతం చేసుకుంటుంది అంటూ విమర్శిస్తూ వస్తున్నారు. తాజాగా జాన్వీ కపూర్ 'హోమ్ బౌండ్' సినిమాలో నటించింది. ఇషాన్ ఖట్టర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించింది. వీరిద్దరు గతంలో ధడక్ సినిమాలో నటించాడు. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా కూడా ఇద్దరికీ మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత వీరి కాంబోలో సినిమా అనగానే అంచనాలు, ఆసక్తి పెరిగింది. అంచనాలు, ఆసక్తికి తగ్గట్లుగానే సినిమా ఉంటుందని మేకర్స్ మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు. తాజాగా ఈ సినిమా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించగా స్టాండింగ్ ఒవేషన్ దక్కింది. విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ సినిమా కమర్షియల్‌గా విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అనే నమ్మకంతో మేకర్స్ ఉన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా దర్శకుడు నీరజ్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు జాన్వీ కపూర్ ఎన్నో విమర్శలు ఎదుర్కొంది. అయితే ఈ సినిమా విడుదల అయ్యాక ఆమెను విమర్శించిన వారే ప్రశంసిస్తారు. సినిమా కోసం జాన్వీ కపూర్ పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. ఆమె నటనను ఉద్దేశించి గతంలో విమర్శించిన వారు ఈ సినిమాను చూసిన తర్వాత కచ్చితంగా షాక్ అవుతారు.



ఆమెలోని నిజమైన నటిని ఈ సినిమాతో గుర్తిస్తారు. ఈ సినిమాతో ఆమె సామర్థ్యం సైతం బయట పడుతుంది. హోమ్ బౌండ్ కథ చెప్పిన వెంటనే జాన్వీ కపూర్ చేసేందుకు ఒప్పుకుంది. ఒక సీరియస్ స్టోరీని ఆమె చేసేందుకు ఒప్పుకోవడంతోనే ఛాలెంజ్‌ను స్వీకరించినట్లు అయిందని అన్నాడు.ఒక మారుమూల ప్రాంతానికి చెందిన కథ ఇది. ఆ ప్రాంతంకు చెందిన ఇద్దరు స్నేహితులు గుర్తింపు, గౌరవం దక్కించుకోవడం కోసం పోలీసు ఉద్యోగాన్ని సంపాదించాలని నిర్ణయించుకుంటారు. అందుకోసం వారు ఏం చేస్తారు, ఆ క్రమంలో ఇద్దరు ఎదుర్కొన్న మానసిక, శారీరక సంఘర్షణ ఏంటి అనేది ఈ సినిమాలో చూపించారు. జాన్వీ కపూర్‌తో పాటు ఇషాన్ ఖట్టర్ సైతం అద్భుతమైన ఎమోషన్స్‌ను కనబర్చి ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయబోతున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా అంతర్జాతీయ స్థాయి విజయాన్ని సొంతం చేసుకోవచ్చు అనే నమ్మకం వ్యక్తం అవుతోంది.



# రెండేళ్ల దాకా భాగ్య శ్రీ బిజీ బిజీ..!



ఏ ముహూర్తాన తెలుగు తెరకు పరిచయం అవ్వాలని అనుకుందో కానీ ఇప్పుడు ఆమె నెక్ట్స్ స్టార్ హీరోయిన్ గా అవతరించబోతుంది. వరుస స్టార్ ఛాన్స్ లు ఆమెకు వస్తున్నాయి. ఇంతకీ ఎవరా లక్కీ హీరోయిన్ అని అనుకుంటున్నారు కదా ఇంకెవరు ఆమె మన భాగ్యం అదే అండి భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో ఒక సినిమా చేసిన ఆమె మన డైరెక్టర్ హరీష్ శంకర్ దృష్టిలో పడింది. ఆయన సినిమాల్లో హీరోయిన్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. అంతేకాదు హరీష్ శంకర్ హిట్ ఇచ్చిన హీరోయిన్స్ కెరీర్ టాప్ రేంజ్ కి వెళ్తుంది. శృతి హాసన్, పూజా హెగ్దే లాంటి హీరోయిన్స్ కి మొదటి బ్రేక్ ఇచ్చిన డైరెక్టర్ ఆయనే. భాగ్య శ్రీ ని కూడా మిస్టర్ బచ్చన్ సినిమాతో పరిచయం చేసిన హరీష్ శంకర్ ఆమె లోని గ్లామర్ యాంగిల్ తో ఆడియన్స్ ని ఫిదా చేశాడు. ఐతే మిస్టర్ బచ్చన్ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. అయినా సరే భాగ్య శ్రీకి వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం అమ్మడు మూడు క్రేజీ సినిమాలతో బిజీగా ఉంది. అందులో ఒకటి విజయ్ దేవరకొండ కింగ్డమ్ కాగా మరోటి ఎనర్జిటిక్ స్టార్ రామ్ తో చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా ఉంది. ఈ రెండిటితో పాటు దుల్కర్ సల్మాన్ రానా నటిస్తున్న కాంత సినిమా కూడా తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్ మూవీగా వస్తుంది. ఈ 3 సినిమాలతో భాగ్య శ్రీ ఆడియన్స్ కు మరింత దగ్గర కానుంది. ఐతే ఈమధ్య ఒక సినిమా కోసం భాగ్య శ్రీని దర్శక నిర్మాతలు కలిస్తే మరో ఆరు నెలల దాకా ఏమి చెప్పలేనని అన్నదట. ఆల్రెడీ అమ్మడికి మరో రెండు సినిమాలు లైన్ లో ఉన్నాయి. సో హిట్ లేకపోయినా సక్సెస్ ఖాతా తెరవకపోయినా కూడా భాగ్య శ్రీ డిమాండ్ అలా ఉంది. భాగ్య శ్రీ మూమెంట్ చూస్తుంటే తప్పకుండా టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ మెటీరియల్ అయిన ఈ అమ్మడిని మన మేకర్స్ ఏమేరకు ఆమె టాలెంట్ వాడుకుంటారన్నది చూడాలి. రాబోతున్న మూడు సినిమాల్లో ఒక్కటి హిట్టు పడినా కూడా భాగ్య శ్రీని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు.

# వెయ్యి కోట్ల స్కామ్.. హీరోయిన్ కు 35 లక్షలు?

తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ (ఁయాఓంఅ) వ్యవస్థలో చోటుచేసుకున్న భారీ లిక్కర్ కుంభకోణం ఇప్పుడు తమిళ పరిశ్రమను కదిలిస్తోంది. దాదాపు 1000 కోట్ల ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) అధికారులు నిర్వహించిన దాడుల్లో కొన్ని సంచలన విషయాలు బయటపడినట్టు సమాచారం. ఇందులో కొంతమంది ప్రముఖుల పేర్లు చర్చకు రావడం, తద్వారా నటి కయాదు లోహర్ పేరు కూడా మీడియాలో ప్రస్తావించబడడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. తాజాగా చెన్నైలో జరిగిన ఈడీ దాడుల్లో పలువురు కీలక వ్యక్తులను విచారించగా, వారిలో కొందరు సినీ రంగానికి సంబంధాలున్నట్లుగా పేర్కొన్నారని సమాచారం.

# అటెన్షన్ లో కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ, మే 23, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవుతుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుంటున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు వస్తున్నారని, అపాయింట్ మెంట్ కావాలని అడిగిన వెంటనే వారు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు వివరాలను తెప్పించుకునే పనిలో ఉన్నారట.ముఖ్యంగా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ల మద్దతు పైనే ఆధారపడి ఉంది. వీరిద్దరూ మోదీ కంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. రాజకీయ అనుభవం ఉన్న నేతలు మాత్రమే కాకుండా తమకు అవసరమైన వాటిని పట్టుబట్టి సాధించుకోవడంలో దిట్టలని పేరుపొందారు. ఇద్దరి నేతల అవసరాలు కూడా కేంద్రానికి ఉండటంతో అడిగిన వెంటనే అపాయింట్ మెంట్లు కూడా ఇచ్చేస్తున్నారు. అందులోనూ ఏపీ పరిస్థితి వేరు. అనేక హామీలు ఇచ్చి 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో రెండు పార్టీలు కలసి ఉన్నాయి..అయినా ప్రజా సమస్యల పరిష్కారం ఇలా చేయొచ్చుగా సామరస్యంగానే చెప్పి... ఈ నేపథ్యంలో చంద్రబాబు తీసుకు వచ్చే ప్రతిపాదనలతో పాటు నిధుల విషయంలో కూడా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి ఉంటుంది. చంద్రబాబు కూడా ఒక పట్టాన వదిలి పెట్టే రకం కాదు. ఆయన గత పర్యటనలో తనకు ఇచ్చిన హామీలను ఇంకా పెండింగ్ లో ఉండటాన్ని కూడా ప్రస్తావించి సానుకూలంగా మాట్లాడుతూనే రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ప్రాజెక్టులను, నిధులను తీసుకెళ్లడంలో చంద్రబాబు నేర్పరి అని హస్తినలో టాక్. అందుకే చంద్రబాబు హస్తిన ప్రయాణం అంటే టీడీపీ పార్లమెంటు సభ్యుల హడావిడి అటుంచితే.. కేంద్ర మంత్రులు మాత్రం హై అటెన్షన్ లో ఉండాల్సిందేనట.

# జ్యోతి మల్హోత్రా... సిరాజ్...

## డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయి..

హైదరాబాద్, మే 23, (న్యూస్ పల్స్)ఉగ్రవాదులకు సహకరించారు.. ఉగ్రవాద అనుబంధ సంస్థలతో కార్యకలాపాలు నెరిపారు.. మనదేశంలో సున్నితమైన ప్రాంతాల సమాచారాన్ని చేరవేర్చారు అనే అభియోగాలతో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రముఖ యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా, ఏపీలోని విజయనగరానికి చెందిన సిరాజ్ పై దృష్టి సారించాయి. దీంతో వారిద్దరి అసలు పన్నాగం బయటపడింది. వీరిద్దరూ కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల విచారణలో ఉన్నారు. అధికారుల విచారణలో వీరికి సంబంధించిన కీలక విషయాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా వీరి బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సాధారణంగా ఇలాంటి వ్యవహారాలకు పాల్పడేవారు బినామీ ఖాతాలతో ఆర్థిక వ్యవహారాలు కొనసాగిస్తారు. కానీ జ్యోతి మల్హోత్రా, సిరాజ్ తమ పేరుతోనే బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తుండడం విశేషం. పైగా బ్యాంకు ఖాతాలలో భారీగా నగదు ఉండడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.జ్యోతి మల్హోత్రా పాకిస్తాన్ ఐఎస్ఐ లో పనిచేసే వ్యక్తితో కొనసాగించిన వాట్సాప్ చాట్ బయటికి వచ్చింది. తనని పెళ్లి చేసుకోవాలని జ్యోతి అతని కోరినట్టు ఆ చాట్ లో ఉంది. అంతేకాదు తనకు ఇస్లామాబాద్ అంటే చాలా ఇష్టమని.. ఇస్లామాబాద్ నగరాన్ని విడిచిపెట్టి రావడం తనకు ఇష్టం లేదని ఆ చాట్ లో జ్యోతి కోరడం విశేషం. మరోవైపు ఐసీస్ అనే ఉగ్రవాద సంస్థ కోసం పని చేస్తున్న సిరాజ్ వ్యవహారం కూడా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులకు తెలియడంతో విజయనగరంలో కలకలం నెలకొంది. ఇక సిరాజ్ ను అదుపులోకి తీసుకున్న అధికారులు అతడిని విచారిస్తున్నారు. అతడి బ్యాంక్ ఖాతాలో భారీగా నగదు ఉండడంతో అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. స్థానికంగా ఉన్న డిసిసిబి లో అతడికి ఖాతా ఉంది. అందులో దాదాపు 50 లక్షల వరకు నగదు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నగదును విత్ డ్రా చేయడానికి సిరాజ్ తల్లిదండ్రులు ప్రయత్నించగా.. బ్యాంకు అధికారులు కుదరదని చెప్పారు.సిరాజ్, జ్యోతి కి దుబాయ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఖాతాలలో నగదువేశారు అని తెలుస్తోంది. అయితే దుబాయిలో వీరికి నగదు వేసిన వ్యక్తులు ఎవరు? విడతలవారీగా లక్షలకు లక్షలు నగదు ఎందుకు వేశారు? ఆ నగదుతో వీరు మనదేశంలో ఎలాంటి కుట్రలకు శ్రీకారం చుట్టారు? అనే కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే జ్యోతి గురించి.. సిరాజ్ గురించి అధికారులు కీలక విషయాలు రాబట్టారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఇంకా కీలక సమాచారం వీరికి సంబంధించిన బ్యాంకు ఖాతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

# హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం పర్యటన


సిద్దిపేట,సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. కాసేపు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ డ్రైనేజీ సమస్యను సందర్శించారు. పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో నిన్న రాత్రి కురిసిన వర్షానికి ముంపుకు గురైన దుకాణాలను, నాళాలను పరిశీలించారు. సమస్యను గురించి దుకాణదారులు, స్థానికులతో మాట్లాడారు. బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలంటూ హైవే కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బస్వాపూర్, పందిళ్ల బ్రిడ్జ్, హుస్నాబాద్ పట్టణంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని హైవే అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఒకవేళ ఇదేవిధంగా జాప్యం చేస్తే కాంట్రాక్టర్ పై అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. వర్షపు నీరు ఇండ్లలోకి, దుకాణాలలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించామని, కొంత ఇబ్బంది జరిగిన ప్రజలు సహకరించాలని కోరారు

# కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు..

హైదరాబాద్, మే 23, (న్యూస్ పల్స్)తెలంగాణ కాంగ్రెస్ లో సీనియర్లు వర్సెస్ జూనియర్లు మధ్య వార్ పార్టీకి కొత్తకాదు. అలకలు , బహిరంగ విమర్శలు, బాహాబాహీ బలప్రదర్శనలు సర్వసాధారణం. ఇన్ని జరిగినా, జరుగుతున్నా.. తెలంగాణలో రేవంత్ సారథ్యంలో అధికారం చేపట్టి అలా ముందుకు సాగుతోంది కాంగ్రెస్ ప్రభుత్వం. తాజాగా కరీంనగర్ జిల్లా జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్నరాజకీయ రచ్చ సీఎం రేవంత్ రెడ్డికి కొత్త తలనొప్పిగా మారింది. కొందరు రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు జీవన్ రెడ్డి నియోజకవర్గం అంటేనే హడలిపోతున్నారు. అక్కడ సొంతపార్టీలో? వర్గపోరులో తామెందుకు ఇరుక్కోవడం అనుకుని జగిత్యాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా మంత్రి పొంగులేటి ముందే జీవన్ రెడ్డి ఆగ్రహం చూసిన కాంగ్రెస్ నేతలకు పార్టీలో ఏం జరుగుతుందో అర్థంకాని అయోమయం నెలకొంది. ఇక మీ రాజ్యం.. మీరే ఏలుకోండి.. అంటూ పొంగులేటి ముఖంమీదే అనేశారు జీవన్ రెడ్డి. రాకరాక కాంగ్రెస్ కు అధికారం చేతికొస్తే ,అదేపార్టీలో ఉన్న సీనియర్ నేత జీవన్ రెడ్డి అలా అనేశారేంటి, ఆయన అంతలా రగిలిపోవడం వెనుక ఏం జరుగుతోంది అనే ఆసక్తి తెలంగాణ రాజకీయాల హీటెక్కిస్తోంది.తెంగాణ కాంగ్రెస్‌లో జీవన్ రెడ్డి వీహెచ్ తరువాత అంతటి సీనియర్ నేత, ఆరు సార్లు ఎమ్మెల్యేగా , ఓసారి ఎమ్మెల్సీగా గెలుపొందిన జీవన్ రెడ్డిని తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తల మద్దతు దండిగా ఉన్నా, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు జీవన్ రెడ్డికి మంటెక్కిస్తున్నాయి. గత ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా పోటీ చేసి గెలిచిన బిఆర్ ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బి?ఆర్ఎస్ వీడి హైదరా?బాద్‌లో రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ రోజు మొదలు జీవన్ రెడ్డికి కంటిమీద కునుకులేదంటే అతిశయోక్తికాదు. నా ప్రత్యర్ధినే , నా అనుమతి లేకుండా కాంగ్రెస్‌లోకి ఎలా చేర్చుకుంటారు. పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన తనను కాదని, సంజయ్‌ను అందలం ఎక్కిస్తారా అంటూ జీవన్ రెడ్డి రగిలిపోతున్నారు. అనేక సందర్భాల్లో తన అసంతృప్తిని బహిరంగంగానే బయటపెట్టారు. రేవంత్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వంలో సీనియర్లను పట్టించుకోవడంలేదంటూ రగిలిపోతున్నారు. ఇలా జగిత్యాల సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేయకుండానే భగ్గుమంటోంది. ఆ సెగలు జగిత్యాలను రాజకీయలను మాత్రమేకాదు, ఏకంగా తెలంగాణ అంతటా వ్యాపిస్తున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి సైతం జోక్యం చేసుకోవడానికి సాహసం చేయలేనంతలా వివాదం ముదిరిపోయింది.జీవన్ రెడ్డి ఆవేదన రెవంత్ రెడ్డి కోటరీకి పట్టడంలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో రేవంత్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కొందరు మంత్రులు, సీనియర్లు జీవన్ రెడ్డికి మద్దతుగా ఏకమవుతున్నారట. ఇటీవల జీవన్ రెడ్డిని కలసి మంత్రి దావోదర రాజనర్సింహ చేసి వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడు, పార్టీ కోసం ఎంతో చేశారు. కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డిని వదులుకోదంటూ మద్దతుగా నిలబడ్డారు. ఇలా రేవంత్ వర్గం మంత్రులు జీవన్ రెడ్డికి అంటి ముట్టనట్లు ఉంటే, సీనియర్లు మాత్రం వేమున్నామంటూ భరోసా ఇస్తున్నారట. ఇలాంటి టైంలో తాను స్పందిస్తే రెండు వర్గాలుగా మారి పరిస్దితి మరింత చేయిదాటుందని భావించిన రేవంత్ రెడ్డి వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. మొత్తానికి బిఆర్ఎస్ నుంచి వస్తున్నారుగా రారమ్మంటూ సంజయ్ ను కాంగ్రెస్ లోకి ఆహ్వానించి, ప్రతిపక్షానికి షాకిచ్చామనే ఆనందం ఓవైపు, తీరా పార్టీలోకి వచ్చాక జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలు , జీవన్ రెడ్డితోపాటు సీనియర్ల నుంచి వస్తున్న విమర్శలు రేవంత్ కి తలనొప్పిగా మారాయట.

# కవిత వేరు కుంపటేనా

హైదరాబాద్, మే 23, (న్యూస్ పల్స్)బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత? పార్టీ అధినేత కేసీఆర్ కు లేఖ రాశారు. పార్టీలోని పరిస్థితులను ఇందులో ప్రస్తావించారు. కొన్ని పాజిటివ్ అంశాలను పేర్కొంటూనే?. మరికొన్ని లోపాలను సూటిగా ఎత్తి చూపారు. కవిత రాసిన లేఖ బయటికి రావటంతో?. బీఆర్ఎస్ లో అసలేం జరుగుతోందన్న చర్చ హాట్ టాపిక్ గా మారింది.తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసిన ఓ లేఖ? ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఏకంగా పార్టీ అధినేత, తండ్రి అయిన కేసీఆర్ కే ఈ లేఖను సంధించారు. పార్టీలోని పరిస్థితులను వివరించే ప్రయత్నం చేశారు. కవిత తీరుపై రాజకీయవర్గాల్లోనే కాదు సొంత పార్టీలోనూ చర్చ జరుగుతోంది. పార్టీ పగ్గాల విషయంలోనే ఇదంతా జరుగుతుందా..? అన్న డిస్కషన్ కూడా తెరపైకి వస్తోంది. ఇప్పటివరకు పార్టీలో కేసీఆర్ తర్వాత?. కేటీఆర్, హరీశ్ రావ్ అంతా తామై నడిపిస్తున్నారు. భవిష్యత్తులో వీరిలోనే ఒకరికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం లేకపోలేదు. ఈ విషయంలో కవితకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో కూడా ఉన్నారనే ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. ఈ కోణంలోనే ఆమె? ఇదంతా చేస్తున్నారనే వాదన కూడా వినిపిస్తోంది.ఓవైపు పాజిటివ్ అంశాలను ప్రస్తావిస్తూనే?. మరోవైపు లోపాలను సూటిగా చూపారు. ఇందుకు సంబంధించిన ఓ లేఖ బయటికి రావటంతో?. అసలు బీఆర్ఎస్ లో ఏం జరుగుతోంది?? కుటుంబ విభేధాలు తారాస్థాయికి చేరాయా..? మరేమైనా పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయా..? వంటి అంశాలు తెరపైకి వస్తున్నాయి'మై డియర్ డాడీ' అంటూ ఎమ్మెల్సీ కవిత ఆరు పేజీల లేఖ రాసినట్లు తెలుస్తోంది. పాజిటివ్, నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అంటూ వివరంగా లేఖ రాశారు. ఎల్కతుర్తి సభ గురించి ఇందులో పలు అంశాలను ప్రస్తావించారు. ఓ రకంగా సభ నిర్వహణ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. సభా వేదికపై పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడి ఉండాల్సిందని



అభిప్రాయపడ్డారు. పార్టీ ఆవిర్భావం నుంచి అండగా నిలిచిన నాయకులు, ధూంధాం కార్యకర్తలు ప్రసంగించి ఉంటే.. అది శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి ఉండేదన్నారు.పార్టీ లీడర్స్‌కు యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖ ద్వారా కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీపై 2 నిమిషాలే మాట్లాడడంతో అనుమానాలు బలపడుతున్నాయని? బీజేపీ వల్ల తాను కూడా చాలా ఇబ్బందిపడ్డాను అని గుర్తు చేశారు. సభా వేదిక నుంచి బీజేపీని టార్గెట్ చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా బీజేపీకి మద్దతు ఇచ్చిందనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందని ఇది పార్టీకి ప్రతికూలంగా మారిందని కవిత గుర్తు చేశారు.వక్ఫ్ బిల్లుపై మాట్లాడి ఉంటే బాగుండేదని? బీసీలకు 42 శాతం కోటా అంశం విస్మరించినట్లు కవిత తన లేఖలో గుర్తు చేశారు.ఎస్సీ వర్గీకరణపై కూడా మాట్లాడలేదని చెప్పారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీకి నిర్దిష్టమైన కార్యక్రమాలు, మార్గదర్శకాలు అవసరమని అంతా భావించారని కానీవరంగల్ సభలో అలాంటి స్పష్టత కొరవడిందని ప్రస్తావించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం, తెలంగాణ గీతం విషయం వంటి అంశాలను కూడా ఇందులో పేర్కొన్నారు.ప్రస్తుతం అమెరికా పర్యటనలో కవిత ఉన్నారు.ఆమె విదేశాల్లో ఉంటున్న సమయంలో లేఖ బయటికి రావటంతో? బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు ఉలికిపాటుకు గురవుతున్నారు . అసలు పార్టీలో ఏం జరుగుతోందని లైన్ లోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేకపోయిన ఆ పార్టీ ఆ తర్వాత ఒక్కో కార్యక్రమాన్ని తీసుకుంటే ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాలను బలంగా చేసింది. ఈ విషయంలో సక్సెస్ అవుతూనే వచ్చింది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏ చిన్న అవకాశాన్ని కూడా చేజారనివ్వకుండా సద్వినియోగం చేసుకున్నట్లు కనిపించింది.కట్ చేస్తే పార్టీ రజతోత్సవ సభను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నాలుగైదు నెలలుగా కసరత్తు చేయగా? ఏప్రిల్ లో సభను నిర్వహించింది. భారీ స్థాయిలో జనసమీకరణ చేయటంతో సభ గ్రాండ్ సక్సెస్ అయింది.

# గ్రూప్, 2, 3 ఇంటర్వ్యూలకు కమిషన్ కసరత్తు

హైదరాబాద్, మే 23, (న్యూస్ పల్స్)తెలంగాణలో ఏప్రిల్ నాటికి ఉద్యోగ నియామకాల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావించినా కోర్టు కేసులతో జాప్యం జరుగుతోంది.ప్రాధాన్యత క్రమంలో గ్రూప్ 1, 2, గ్రూప్ 3 ఉద్యోగాలను భర్తీ చేయాలని భావించినా ఆలస్యమైంది.గ్రూప్ 1 వ్యవహారం కొలిక్కి రావడంతో గ్రూప్2, 3 సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపడతారు.తెలంగాణ గ్రూప్ 1 నియామక ప్రక్రియ కొలిక్కి వస్తుడంటంతో మిగిలిన ఉద్యోగ నియామకాలను కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గ్రూప్-1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిలిపివేయాలంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడం, పిటిషనర్లకు న్యాయస్థానం జరిమానా విధించడంతో గ్రూప్1 సర్టిఫికెట్ వెరిఫికేషన్ తుది తీర్పుకు లోబడి నిర్వహించారు.గ్రూప్1 వ్యవహారంపై కమిషన్ వాదనలతో కోర్టులో న్యాయ వివాదం కొలిక్కి వచ్చిన వెంటనే టీజీపీఎస్సీ మిగిలిన ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కమిషన్ భావిస్తోంది.తెలంగాణలో 2,171 గ్రూప్-2, 3 పోస్టుల భర్తీకి కమిషన్ కసరత్తు ప్రారంభించింది,. రాత పరీక్షల్లో జనరల్ ర్యాంకింగ్ ఆధారంగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టేందుకు పరిపాలన ప్రక్రియను టీజీపీఎస్సీ ఇప్పటికే పూర్తి చేసింది.ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్లు, మొత్తం పోస్టుల సంఖ్య ఆధారంగా 1:11 నిష్ప త్తిలో అభ్యర్థుల జాబితా ప్రకటించనుంది. గ్రూప్2, గ్రూప్ 3 ఉద్యోగ నియామకాల ప్రక్రియ ఇప్పటికే ఆలస్యం కావడంతో వెంటనే చేపట్టడమో, గ్రూప్ 3 పోస్టింగుల ప్రక్రియ పూర్తయ్యాక చేపట్టాలనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.783 గ్రూప్2 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబరు 15,16 తేదీల్లో రాత పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు ,49,964 మంది హాజరయ్యారు. ఓఎంఆర్ పత్రాల్లో పొరపాట్లు చేయడం, బబ్లింగ్ సరిగా చేయకపోవడం వంటి కారణాలతో 13,315 మంది అభ్యర్థులను కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మరోవైపు గ్రూప్-2 పరీక్షలు పూర్తైన మూడు నెలల్లోపే జనరల్ ర్యాంకు జాబితా టీజీపీఎస్సీ ప్రకటించింది. పరీక్ష రాసిన వారిలో 2,36,649 మందికి వచ్చిన మార్కులతో జనరల్ ర్యాంకింగ్ జాబితాను ఈ ఏడాది మార్చి 11న విడుదల చేశారు?.గ్రూప్-3 రాత పరీక్షల జనరల్ ర్యాంకింగ్ కూడా ఇప్పటికే విడుదలైంది. గ్రూప్ 3లో 1,388 పోస్టుల భర్తీకి 2024 నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించిన రాత పరీక్షలకు 2,67,921 మంది హాజర య్యారు. పరీక్షల్లో నిబంధనలు పాటించని 18,364 మందిని పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనర్హులుగా ప్రకటించింది.మిగిలిన 2,49,557 మంది అభ్యర్థులతో మార్చి 14న జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ విడుదలైంది. ఏప్రిల్ నెలాఖరుకు అన్ని నియామకాలు పూర్తి చేయాలని కమిషన్ భావించినా గ్రూప్-1పై న్యాయవివాదాలు రావడంతో గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆలస్యమైంది.గ్రూప్-1 నియామక ప్రక్రియ పూర్తి కాకుండా గ్రూప్-2, 3 ఎంపికలు ప్రారంభిస్తే పోస్టుల్లో ఖాళీలు మిగిలిపోతాయని కమిషన్ భావిస్తోంది. మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా ప్రాధాన్య క్రమంలో పోస్టుల్ని భర్తీ చేయాలని యోచిస్తోంది.స్త్రీ శిశు సంక్షేమ శాఖలో సీడీపీవో, మేనేజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. 2022లో విడుదలైన 23పోస్టులకు 19,812 మంది దర ఖాస్తు చేశారు. 2023 జనవరిలో ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత టీజీపీఎస్సీ పరీక్షల పేపర్ లీక్ కావడంతో ఈ ఏడాది జనవరి 3,4 తేదీల్లో మరోసారి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. దీని ఆధారంగా మల్టీ జోన్ 1,2 ఫలితాలను విడుదల చేశారు. కమిషన్ వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయి.

# 21 నుంచి దోస్త్ సీట్ల కేటాయింపు

హైదరాబాద్, మే 23 (న్యూస్ పల్స్)తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ - 2025 షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫస్ట్ ఫేజ్ రిజిస్ట్రేషన్ల గడువు ముగిసింది. మరోవైపు వెబ్ ఆప్షన్ల గడువు కూడా పూర్తి కానుంది.మరికొన్ని గంటలు మాత్రమే ఉండటంతో? రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.దోస్త్ ఫస్ట్ ఫేజ్ కు సంబంధించి 87వేలకుపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్లుచేసుకున్నారు. వీరిలో 50 వేలకుపైగా మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు. మిగిలిపోయిన విద్యార్థులు కూడా ష్ట్రబిబిజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని వెబ్ సైట్ లోకి వెళ్లి ప్రాసెస్ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. మే 29వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్లను కేటాయించనున్నారు.దోస్త్ 2025 ఫస్ట్ ఫేజ్ లో సీట్లు పొందే విద్యార్థులు మే 30వ తేదీ నుంచి ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలి. ఈ గడువు జూన్ 6వ తేదీతో ముగుస్తుంది. సీటు పొందిన కాలేజీలో రిపోర్టింగ్ చేయకపోతే? వారి సీటు రద్దు అవుతుంది. మొదటి సెమిస్టర్ తరగతులు జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభవుతాయి.దోస్త్ ఫస్ట్ ఫేజ్ లో సీటు పొందే విద్యార్థులు ష్ట్రబిబిజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని/లివశ్రీఇనీఎవ.టనీ వెబ్ సైట్ నుంచి అలాట్ మెంట్ కాపీని పొందవచ్చు. ఈ కాపీతో పాటు విద్యార్హత పత్రాలను సంబంధిత కాలేజీలో సమర్పించి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.తెలంగాణ దోస్త్ 2025 రెండో విడత కింద మే 30 నుంచి జూన్ 8 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఇక మూడో విడత ప్రక్రియ జూన్ 13 నుంచి షురూ అవుతుంది. ఇందుకు జూన్ 19వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు ఉంటుంది.ఇంటర్ పూర్తి అయిన విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. కాలేజీలను ఎంచుకోవాలి. వారి స్కోర్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. దోస్త్ రిజిస్ట్రేషన్ల ద్వారా తెలంగాణలోని ఉస్మానియా యూనివర్శిటీ, కాకతీయ యూనివర్శిటీ, పాలమూరు, మహాత్మగాంధీ, తెలంగాణ వర్శిటీ,చాకలి ఐలమ్మ, శాతవాహన వర్శిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను కల్పిస్తారు.

# వన్ స్టాప్ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందజేయండి.:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



నంద్యాల(విజయ సారథి):వన్ స్టాప్ సెంటర్ ద్వారా హింసకు గురైన మహిళలకు సహాయ సహకారాలు అందించడంలో మెరుగైన సేవలు అందజేయాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మిషన్ శక్తి సమీకృత మహిళా సాధికారత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో ఇంచార్జి ఐసిడిఎస్ పిడి తేజేశ్వరి, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐటిడిఎ పిఓ వెంకట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వన్ స్టాప్ సెంటర్ ద్వారా అవసరం ఉన్న మహిళలకు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. వన్ స్టాప్ సెంటర్ ను 2024వ సంవత్సరం ఆగస్టు 1వ తేది జిల్లాలో ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు 32 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసుల వివరాలను పూర్తి స్థాయిలో డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ లో ఆశ్రయం పొందిన మహిళలు కౌన్సిలింగ్ పొందిన అనంతరం సంబందిత స్వస్థలాల్లో వారు ఏ పరిస్థితిలో ఉన్నారన్న విషయాన్ని ఎప్పటికపుడు విచారిస్తూ ఉండాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లో కూడా మహిళలు అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లతో పాటు వన్ స్టాప్ సెంటర్ చిరునామా, సిసిఏ నెంబర్లు కూడా ఏర్పాటు చేసేలా చూడాలని వన్ స్టాప్ సెంటర్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పిల్లల్లో విద్యార్థి దశ నుండే పోక్సో కేసులపై అవగాహన కల్పించడం ద్వారా కొంత మేరకు కేసుల తగ్గే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడానికి పెళ్లిల సమయంలో వివాహ వేదిక బుక్ చేసుకునే సమయంలో వధువు, వరుడి పుట్టిన తేదీలను పరిశీలించాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ లో సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టును భర్తీ చేసేలా ఫైల్ ప్రాసెస్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో స్వీయ రక్షణ కోర్సులను జూన్ లో ప్రారంభించి సెప్టెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యార్థినిలు, మహిళలు కూడా అందరీ చరవాణిలో తప్పనిసరిగా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, శక్తి టీమ్ ద్వారా అన్ని పాఠశాలలు, కళాశాల లోని విద్యార్థినలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కమిటీ సమావేశంలో యువజన సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్మన్ జుబేదాబేగం, జిల్లా ఖజానా శాఖ అధికారి లక్ష్మీదేవి, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆమదాలవలస పట్టణం లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేరాష్ట్ర పియుసి ఛైర్మన్ కూన రవికుమార్



ఆముదాలవలస(విజయ సారథి):ఆమదాలవలస నియోజకవర్గం లో ఆమదాలవలస పట్టణం లో ఉన్న పార్టీ ఆఫీస్ వద్ద ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి పలు ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదుల్ని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులుని ఆదేశించారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ను నూతన భవనంలో కి మార్చాలి

ప్యాపిలి –డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ను ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా పట్టణంలోని షాది ఖానా పక్కన ఉన్న నూతన భవనము లోకి మార్చాలని సిపిఐ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా రిజిస్టర్ అధికారి పివిఎన్ బాబు కి వినతి పత్రంని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సిపిఐ డోన్ పట్టణ కార్యదర్శి మోట. రాముడు ఎఐటియసి భూమిని, శ్రీనివాసులు, బి. శ్రీనివాసులు అందజేశారు



# టీడీపీ జిల్లా మహానాడును విజయవంతం చేసిన జిల్లా తెలుగుదేశం నేతలకు కృతజ్ఞతలు తెలిపిన పాలకుర్తి తిక్కారెడ్డి.



కర్నూలు(విజయ సారథి):తెలుగుదేశంపార్టీ అధినేత ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా మహానాడు గురువారం నిర్వహించడం జిరిగింది. ఈ మహానాడు గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎంతో ఉత్సాహంగా హాజరై విజయవంతం చేయడం జరిగిందని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలియజేశారు. శుక్రవారం పత్రికల విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా మహానాడుకు కర్నూలు జిల్లా పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గములు మరియు పాణ్యం పరిధిలోని 16 వార్డులు, కోడుమూరు పరిధిలోని 3 వార్డుల కర్నూలు నాయకులు కార్యకర్తలు మరియు అభిమానులు హాజరు కావడం జరిగిందని, అదే విధంగా ఎం.ఎల్.ఏలు, ఇన్చార్జ్లు మరియు కర్నూలు పార్లమెంట్ సభ్యులు, మాజి మంత్రివర్యులు, మాజి ఎం.ఎల్.ఏలు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వారి అనుచరులు తెలుగుదేశంపార్టీ మరియు పార్టీ అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు మండల కమిటీల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్, కుటుంబ సాధికార కమిటీ సభ్యులు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేసినందులకు వారికి ఒక్కొకరికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ మహనాడు కార్యక్రమం గురించి ఎప్పటికప్పుడు పత్రికల ద్వారా ఎలెక్ట్రానిక్ మీడియా సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తూ కార్యక్రమం విజయవంతంలో ప్రత్యేక శ్రద్ధ కనపరిచిన ప్రతినిధులకు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ తరపున హృదయపూర్వకంగా ధన్యవాదములు తెలియజేస్తూ, రానున్న రోజులలో ఇదే సహకారాన్ని అందించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆలాగే ఈ మహనాడు కా విజయవంతానికి తోడ్పాటు అందించిన వారంతా కడపలో జరిగే రాష్ట్ర మహానాడు కార్యక్రమమునకు హాజరై కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొనిరావల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

- ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం(విజయ సారథి):శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం టౌన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని గత 10 నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రూ. 12.30 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి టి.జి భరత్

కర్నూలు(విజయ సారథి):కర్నూలు నగరంలోని పలు వార్డుల్లో రూ. 12.30 కోట్ల పనులకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ శంకుస్థాపన చేశారు. ముందుగా నగరంలోని అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జి వద్ద సిసి రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. అనంతరం13, 46, 42, 13, 51, 1, 3, 8, 14, 14, 15, 16, 24, 23, 22, 25 వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపనలు చేశారు. హైదరాబాద్ నుండివచ్చే వాహనాలు ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా కొత్త బస్టాండ్ వైపు వచ్చేందుకురోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరంరాష్ట్రమంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ నగరవాసులకు ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వార్డుల్లో పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. వీటన్నింటినీకల్పించేందుకుతానుకృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వైజాగ్ తరహాలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఉండేలా పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇటీవలె కాంట్రాక్టర్లతో చర్చించి వారి సమస్యలు కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తాను శంకుస్థాపన చేసిన ప్రతి ఒక్క అభివృద్ధి నాణ్యతతోనిర్ణీతసమయంలోపూర్తయ్యేలాచర్యలు తీసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించానన్నారు. అశోక్ నగర్ రైల్వే బ్రిడ్జివద్ద వర్షం పడితే నీరు నిల్వ ఉండి రాకపోకలకు ఎంతో ఇబ్బంది కలుగుతోందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంతో



పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గడిచిన ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని.. దీన్ని సెట్ చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌ను రూ. 2700 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇక ఓర్వకల్లు నుండి విజయవాడకు విమానసౌకర్యం కల్పించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఇండిగో కంపెనీతో మాట్లాడినట్లు తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో భవిష్యత్తులో ఎన్నో పరిశ్రమలు వస్తాయన్నారు. 14 వేల కోట్లతో సెమీ కండక్టర్ల కంపెనీ, ఎలక్ట్రానిక్ వెహికల్స్ తయారీ కంపెనీ రాబోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాజధానికి కచ్చితంగా విమాన సౌకర్యం ఉండాలన్న ఉద్దేశంతో ఇందుకోసం తీవ్రంగా కృషి చేశానన్నారు. రానున్న రోజుల్లో కర్నూలు–విజయవాడకు విమాన సర్వీసు ప్రతిరోజూ నడిపేలా కృషి చేస్తామన్నారు. దీంతో పాటు రెండు పైలట్ ట్రైనింగ్ సెంటర్లు కూడా వచ్చాయన్నారు. ఇండియాలో పైలట్లు తక్కువ సంఖ్యలో ఉన్నారని.. ఈ రంగంలో రాణించేందుకు యువత ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతపురం నుండి కర్నూలు వరకు మెగా ఇండస్ట్రియల్ కారిడార్ చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమ రానున్న రోజుల్లో ఎంతో అభివృద్ధి చెందబోతుందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యస్.రవీంద్ర బాబు, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు చేయాలి

- కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి
- బాధిత కుటుంబాలకు రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.4 కోట్లు పరిహారం చెల్లించాం
- ఇంటిస్థలం, ఉద్యోగం త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు స్వాతి కిరణం ప్రతినిధి, మే 23: ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు కు సంబంధించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జిల్లా అధికారులు, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ 2013 నుండి 2025 వరకు పెండింగ్ లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అండర్ ఇన్వెస్టేషన్ కేసులను పోలీసు అధికారులతో సమీక్షించారు..చాలా రోజుల నుంచి పెండింగ్ లో ఉన్న కేసులను కూడా త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు... అదే విధంగా ఛార్జ్ షీట్ అయి నెంబరింగ్ కాని కేసుల వివరాల లిస్ట్ ఇవ్వాలని, సంబంధిత నివేదికను జడ్జి గారికి అందజేసి నెంబరింగ్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.. కాస్ట్ సర్టిఫికెట్ కారణంగా ఏ కేసు కూడా పెండింగ్ ఉండకూడదని, రెవెన్యూ అధికారులు ఈ అంశంపై తక్షణం స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్, డిసిఆర్బి సిఐ లు సమన్వయంతో ఇప్పటివరకు ఉన్న కేసులకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించాలని, తద్వారా కేసు స్టేటస్ ఏ స్థాయిలో ఉంది అని తెలుస్తుందన్నారు.. ఎస్సీ, ఎస్టీ అత్యాచార బాధిత కుటుంబాలకు త్వరితగతిన రిలీఫ్, ఇతర ప్రయోజనాలను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.. గత 6 నెలల్లో బాధిత కుటుంబాలకు మానిటరీ రిలీఫ్ కింద రూ.4 కోట్లు అందించామన్నారు.. ఇంకా పెండింగ్ లో రూ. 50 లక్షలు ఉందని, ఆ మొత్తాన్ని కూడా త్వరితగతినిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. రాష్ట్రంలోనే ఇంత ఎక్కువ మొత్తం లో మానిటరీ రిలీఫ్ ఇచ్చిన జిల్లా కర్నూలు జిల్లా అని, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.. హత్య కేసులకు సంబంధించి బాధితులకు ఇంటిస్థలం, ఉద్యోగం త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు.. అలాగే ఇప్పటివరకు 19 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, మిగిలిన వారికి కూడా ఖాళీగా ఉన్న పోస్టులలో అర్హత మేరకు ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్వో ను ఆదేశించారు... వచ్చే సమావేశం నాటికి పెండింగ్ లో ఉన్న అందరికీ ఇంటి పట్టాలు, ఉద్యోగం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు..రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు..ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు గాను రూ.7 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, అందులో దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, పెండింగ్లో ఉన్న 20 శాతం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.. అదే విధంగా హాస్టళ్లకు వంట పాత్రలు కూడా కొత్తవి మంజూరు చేశామన్నారు...డివిఎంసి సభ్యులు ప్రస్తావించిన అంశాలపై కలెక్టర్ స్పందిస్తూ నగరంలోని 18, 19 వార్డులలో అంగన్వాడి సెంటర్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కేసులకు సంబంధించి సోషల్ మీడియాలో రూమర్లు వ్యాపింప చేయడం వల్ల శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని తెలిపారు.. అలా చెయ్యకుండా సభ్యులు చొరవ తీసుకోవాలని ఎస్పీ సూచించారు.. ఏవైనా సమస్య ఉంటే సమావేశం వరకు ఆగకుండా తనకు గానీ, కలెక్టర్ గారి దృష్టికి కానీ తీసుకొని వస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ సూచించారు.సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్,డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్, పత్తికొండ ఆర్డీఓ భరత్, సాంఘిక సంక్షేమ అధికారి తులసీ దేవి, డివిఎంసి సభ్యులు రవికుమార్, సురేష్ గౌడ్, వెంకట నాగరాజు యాదవ్, మాలతి, మధు నాయక్, మద్దిలేటి, కురువ మద్దిలేటి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు..

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com